WWW.SAKSHYAM.COM

సత్యం, సమర్థత, విశ్వసనీయత

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

Telangana

హైదరాబాద్
గురువారం, 22 మే 2025
Published from Hyderabad, Karim nagar & Nalgonda, Vijayawada.

సంపుటి: 16 | సంచిక: 143
పేజీలు: 08 | వెల: రూ.2:00



## సోనియా, రాహుల్ 142 కోట్లు లబ్ది పొందారు

**ప్రత్యేక కోర్టులో ఈడీ సంచలన ఆరోపణలు**
**నేషనల్ హెరాల్డ్ కేసులో విచారణ..**

న్యూఢిల్లీ,మే21(సాక్ష్యం): నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు లబ్ది పొందారని పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు చేసింది. ఈ నేరంలో వారు రూ.142 కోట్లు లబ్ది పొందారని ఆరోపించింది. నేరపూరిత ఆర్జనతో

మిగతా 2 లో..



## మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతకు షాక్

**గాంధీభవన్‌లో ధర్నా చేసినందుకు నోటీసులు**

హైదరాబాద్,మే21(సాక్ష్యం): తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతా రావుకు పార్టీ అధిష్టానం షోకాజ్ నోటీసులిచ్చింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌పై చేసిన వ్యాఖ్యలు, గాంధీ భవన్‌లో నిరసన చేయడాన్ని కాంగ్రెస్ అధిష్టానం తప్పుబట్టింది. క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు సునీతా రావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసు జారీ

మిగతా 2 లో..

# భీకర ఎన్ కౌంటర్..

## తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘఢ్ మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ



- ఎన్‌కౌంటర్‌లో 27మంది నక్సల్స్ మృతి
- అగ్రనేత నంబాల కేశవరావు హతం
- గణపతి తరువాత బాధ్యతలో చేపట్టిన నంబాల
- ధృవీకరించిన హోంమంత్రి అమిత్ షా
- వచ్చే మార్చి కల్లా మావోయిస్టుల అంతం చేస్తాం
- కోటిన్నర రివార్డు ఉన్నట్లు పోలీస్ అధికారుల వెల్లడి
- భద్రతా బలగాలను అభినందించిన ప్రధాని
- ఎక్స్ వేదికగా నంబాల హతంపై స్పందన



**ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన మావోయిస్టు ఆగ్రనేత నంబాల కేశవరావు మృతి చెందారు. నారాయణపుర్ జిల్లాలోని అబూజ్ మడ్‌లో జరిగిన భారీ ఎన్ కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులతో పాటు ఆయన మృతి చెందారు. కేశవరావు ఉన్నారన్న సమాచారంతో మాధ్ ప్రాంతాన్ని బలగాలు చుట్టుముట్టి అంతమొందించారు. నంబాల కేశవరావుపై కోటిన్నర రివార్డు ఉందని పోలీసులు తెలిపారు.**

బీజాపూర్,మే21(సాక్ష్యం): ఛత్తీస్‌గఢ్ మరోసారి తుపాకీ మోతతో దద్దరిల్లింది. మావోయిస్తులకు భారీ దెబ్బ పడింది. ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత సహా మొత్తం 27మంది హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ. 1.5కోట్లు

మిగతా 2 లో..

# ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోడీ



## పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవడంలో విఫలం రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్


హైదరాబాద్,మే21(సాక్ష్యం): మోదీ ప్రభుత్వం ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పహల్గాం దాడి తర్వాత దేశం అంతా ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచిందని.. కానీ పాకిస్తాన్ కు బుద్ధి చెప్పడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందని అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా మోదీ ప్రభుత్వం వెనకడుగు వేసిందని.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని విమర్శించారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా.. ఆయన విగ్రహానికి సీఎం రేవంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ దేశానికి వన్నె తెచ్చిన నేత రాజీవ్ గాంధీ అని ఈ సందర్భంగా కొనియాడారు. 18 ఏండ్లకే యువతకు ఓటు హక్కు కల్పించారని.. దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీకి సొంతమని అన్నారు. 1971 పాకిస్తాన్ పై

మిగతా 2 లో..

## దేశ రహస్యాలు పాక్‌కు చేరవేత!

- ట్రావెల్ జో పేరుతో పర్యటనలు
- పాక్ హైకమిషన్ కార్యాలయంలో డానిష్‌తో సంబంధాలు
- జ్యోతి మల్హోత్రా విచారణలో విస్తుపోయే నిజలు!

**గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఈ కేసు దర్యాప్తును అధికారులు ముమ్మరం చేశారు. దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఐఎస్ఐ హ్యాండ్లర్‌తో జ్యోతి చాటింగ్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. అందులో తనని పాకిస్థాన్‌లో పెళ్లి చేసుకోవాలంటూ జ్యోతి కోరడం గమనార్హం.ఐఎస్ఐతో సంబంధాలున్న అలీ హసన్ అనే వ్యక్తితో జ్యోతి నిత్యం టచ్‌లో ఉంటున్నట్లు అధికారులు తమ దర్యాప్తులో ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే.**



న్యూఢిల్లీ,మే21(సాక్ష్యం): భారత్‌కు సంబంధించిన రహస్య కార్యకలాపాల గురించి వీరిద్దరూ చర్చించుకున్నట్లు తేల్చారు. వాటిని రహస్యంగా ఉంచేందుకు పలు ఎన్‌క్రిప్ట్ చేసిన ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించినట్లు విచారణలో తేలింది. స్నాప్‌చాట్, టెలిగ్రామ్, వాట్సాప్‌లో కోడ్ ల్యాంగ్వేజ్‌లో మాట్లాడుకున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. భారతదేశ అండర్‌కవర్ ఆపరేషన్లకు సంబంధించి సంకేత భాషలో వారి మధ్య సాగిన సంభాషణలు దర్యాప్తు బృందానికి లభించాయి. చాటింగ్ సందర్భంగా 'నన్ను పాకిస్థాన్‌లో పెళ్లి చేసుకోవాలి' అని జ్యోతి కోరింది. ఇందుకు సంబంధించిన చాటింగ్ వివరాలు తాజాగా

మిగతా 2 లో..

## దేశంలో మళ్లీ కరోనా బెల్స్

- ముంబైలో అత్యధికంగా పాజిటివ్ కేసులు
- జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించిన ప్రభుత్వం



న్యూఢిల్లీ,మే21(సాక్ష్యం): దక్షిణాసియాలో కొవిడ్-19 మళ్లీ విజృంభిస్తోంది. భారత్‌లోనూ కరోనా వైరస్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అయితే, మరణాలు కూడా సంభవిస్తుండటం


మిగతా 2 లో..

# హైదరాబాద్‌లో పలు చోట్ల భారీ వర్షం

- ఉరుములు, మెరుపులతో దంచికొట్టిన వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం..
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం
- జిల్లాల్లోనూ పలుచోట్ల భారీ వర్షం

హైదరాబాద్,మే21(సాక్ష్యం): హైదరాబాద్‌లోని పలుచోట్ల వర్షం భారీ వర్షం కురిసింది. మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, కొత్తపేట, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, తిరుమలగిరి, బేగంపేట, అల్వాల్, సైదాబాద్, సంతోష్‌నగర్, చాదర్‌ఘాట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడా, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డలో

మిగతా 3 లో..



## నెలాఖరులోగా రుతుపవనాల రాక

- రాగల మూడ్రోజులు వర్షాలు
- భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తం కావాలి
- జిల్లా కలెక్టర్లను ఆదేశించిన ప్రభుత్వం

హైదరాబాద్,మే21(సాక్ష్యం): ప్రస్తుత వర్షాకాల సీజన్ లో ఈ నెలాఖరులోగా రుతుపవనాలు ప్రవేశిస్తున్నా యని, దీనితో రాష్ట్రంలోని పలు జిల్లాలో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున, ఏవిధమైన విపత్తులు జరుగకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. తెలంగాణ రాష్ట్రంలో మే మాసాంతం వరకే రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో జిల్లాలకు ముందస్తు చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తగు మార్గదర్శకాలను విడుదల చేశారు. గత 2024 ఆగస్టు మాసంలో వచ్చిన భారీ వర్షాలతో సకాలంలో ఎన్డీఆర్ఎఫ్ దళాలు చేరుకోక పోవడంతో జరిగిన నష్టాన్ని

మిగతా 3 లో..

## కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

**కెసిఆర్‌కు నోటీసుల వెనక రెండు పార్టీల కుట్ర**
**ఎన్ని నోటీసులు ఇచ్చిన ధైర్యంగా ఎదుర్కొంటాం**
**కెసిఆర్‌కు నోటీసులపై కేటీఆర్ విమర్శలు**

నల్లగొండ,మే21(సాక్ష్యం): నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని,బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఇచ్చిన నోటీసులపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. చట్టాలు, న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, కాంగ్రెస్, బిజెపి ఆడుతున్న నాటకంలో భాగంగానే

మిగతా 3 లో..



# సంపాదకీయం

## బహిర్గతం చేయరాని విషయాలపై వ్యాఖ్యలా?

దేశ సార్వభౌమాధికార విషయంలో ఏ పార్టీ అయినా ఒక్కటిగా ఉండాల్సిందే. అంతర్జాతీయ విషయాల్లో ఏకముఖంగా సాగాలి. ఇటీవలి పాక్‌తో కాల్పుల ఘటనకు సంబంధించి అందరూ ఒక్కతాటిపైనే ఉన్నట్లు కనిపించినా మెల్లగా స్వరం మారుస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తీరు అనుమానాస్పదంగా ఉంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల వ్యాఖ్యలు రక్షణ దళాల సమర్థతను శంకించేలా ఉన్నాయి. నిజానికి పహల్గామ్ దాడి తరవాత కూడా పిచ్చికూతలు కూసిన వారి వ్యాఖ్యలను పాకిస్థాన్ రికార్డు చేసి, వాటిని ప్రపంచ దేశాల ముందుంచింది. పహల్గామ్ దాడి విషయంలో హిందువువేనా అని నిర్ధారించుకుని కాల్పులు జరిపారు. దీనిపై కొందరు నేతలు అవాకులు చవాకులు పేలారు. అదంతా ఉత్తిదేనని, అలాంటిదేమీ జరగేలదని కొందరు అన్నారు. ఇప్పుడేమో ఖర్గే, అసలది యుద్ధమే కాదు..చిన్న యుద్ధమే అంటూ దీరాలు తీస్తున్నారు. రాహుల్ మాత్రం మనవి ఎన్ని విమానాలు కూలాయని ఆరా తీస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారాలు. అనుమానాలు ఉంటే రక్షణశాఖ అధికారులను కలిసి తెలుసుకోవచ్చు. అలాగే తెలుసుకున్న సమాచారాన్ని గుట్టు చప్పుడు కాకుండా కాపాడుకోవాలి. తాజాగా జరిగిన భారత్-పాకిస్తాన్ ఘర్షణలతో అర్ధాంతరంగా రెండు దేశాలు కాల్పుల విరమణకు ఒప్పుకోవడం వెనక కారణాలు చెప్పాలని కూడా కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ తదితర పార్టీల తీరు కేవలం పాక్‌కు మాత్రమే అనుకులంగా ఉంటుందని అర్థం చేసుకోవాలి. ఇది చిన్నపాటి యుద్ధమేనని, కాల్పులు ఎందుకు ఇరమించారని నిలదీస్తున్నారు. మనవి ఎన్ని విమానాలు కూలాయని రాహుల్ అంటున్నారు. శశిథరూర్‌ను విదేశీశాకు వెళ్లే బృందందలో ఎంపిక చేస్తే తట్టుకోవడం లేదు. గతంలో ఐక్యరాజ్యసమితిలో పనిచేసిన అనుభవం థరూర్‌కు ఉంది. ఇకపోతే అమెరికా తీరు కూడా అనుమానాస్పదంగా ఉంది. పాక్, భారత్ ఘర్షణలతో తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అకస్మాత్తుగా తామే రెండు దేశాలను ఒప్పించి, కాల్పుల విరమణకు దోహదం చేశామని చెప్పుకోవడం ..తరవాత నా ప్రమేయం లేదనడం వంటివన్నీ చూస్తున్నాం. అయితే ఇందులో అమెరికా ప్రమేయం లేదని భారత్ పదేపదే స్పష్టం చేస్తూ రావడం గమనిస్తే తెరవెనుక చీకటి రహస్యాలు దాగి ఉన్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి. ముందురోజు కూడా ఈ ఘర్షణ విషయంలో జోక్యం చేసుకోనని చెబుతూ వచ్చిన అమెరికా అంత అకస్మాత్తుగా ఎందుకు కాల్పుల విరమణ జరపాలని రెండు దేశాలపై ఒత్తిడి తెచ్చిందన్నది కూడా ముఖ్యమే. ఇజ్రాయిల్‌ను, రష్యాను ఇలాంటి సందర్భాల్లో ఒత్తిడి చేయలేక పోయింది. తన మాట వినకపోతే వాణిజ్య సంబంధాలు నిలిపివేస్తామని బెదిరించడంతో రెండు దేశాలు దారికి వచ్చాయని స్వయంగా డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం గమనార్హం. ఇదే సమయంలో పాకిస్తాన్ అణుస్థావరం అని చెబుతున్న కిరానా హిల్స్ వద్ద భారత్ వైమానిక దళం క్షిపణులు ప్రయోగించడంతో అణుధార్మికత లీకేజీ జరగడంతో అమెరికా రంగంలోకి దిగి ఒత్తిడి తెచ్చిందనే ప్రచారం కూడా జరుగుతోంది.అయితే, అక్కడ అణుస్థావరం ఉన్నట్లు తమకు తెలియదని, ఆ ప్రాంతంలో అసలు తాము క్షిపణులనే ప్రయోగించలేదని భారత వైమానిక దళాధికారి స్పష్టం చేశారు. కిరానా హిల్స్ లో ఎలాంటి లీకేజీ జరగలేదని 'ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఎమ్జ్గ÷న్సీచెబుతోంది. అసలు కిరానా హిల్స్‌పై వస్తున్న వార్తలపై పాకిస్తాన్ ఎందుకు మౌనం పాటిస్తోంది? దాయాది దేశం కిరానా హిల్స్ విషయంలో ఏమైనా దాచిపెడుతుందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ భారత్‌పై అణ్వస్త్రాలు ప్రయోగించ డానికి సిద్ధమవుతుండగా, కట్టడి చేసేందుకు భారత్ క్షిపణి ప్రయోగించిందనే కథనాలు కూడా వెలువడ్డాయి. అణుదాడుల గురించి దాయాది దేశం నుంచి ఎటువంటి సంకేతాలు రాలేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తాజాగా తేల్చి చెప్పారు. బరోవైపు పాక్ అణుదాడి హెచ్చరికలను ప్రధాని మోడీ కూడా కొట్టిపారేశారు. ఇలాంటి హెచ్చరికలతో భారత్‌ను బెదరించలేదరని అన్నారు. కిరానా హిల్స్ ప్రాంతంలో అణ్వస్త్రాల స్థావరం ఉందని, రెండు దేశాల ఘర్షణ ఆ ప్రాంతానికి ఎక్కడ విస్తరిస్తుందో అన్నభయంతోనే కాల్పుల విరమణ జరిగే విధంగా రెండు దేశాలకు అమెరికా నచ్చచెప్పే ప్రయత్నం చేసిందని భావించాల్సి వస్తుంది. ఆ ప్రయత్నం కూడా రష్యా- ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చల మాదిరిగా సుదీర్ఘంగా చర్చలతో కాలయాపన చేయకుండా తక్షణమే అమలులోకి వచ్చే విధంగా ప్రయత్నం జరిగిన్నట్లు స్పష్టం అవుతుంది. విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘం సమావేశంలో ఈ ఘర్షణలతో జరిగిన దాడులు, నష్టాల వివరాల గురించి పలువురు ఎంపిలు ప్రశ్నించగా 'జాతీయ భద్రత' దృష్ట్యా అటువంటి వివరాలు వెల్లడించ లేమని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొనడం గమనార్హం. ఏదేమైనా ఇటీవల చోటు చేసుకున్న భారత్ పాకిస్థాన్ ఘర్షణలకు సంబంధించి ప్రభుత్వ వాదనను విశ్వసించాల్సిందే. ఇందులో ఈకలు పీకాల్సిన పనిలేదు. గతంలో ఇందిర చేసిందే యుద్ధం.,.మోడీ యుద్ధం ఏమీ చేయలేదనడం కూడా సరికాదు. కాంగ్రెస్ నేతలు ఆచితూచి మాట్లాడితే మంచిది. దేశం ముందు అంతా సమానమే. మన భద్రత, సార్వభౌమాధికారం కూడా ముఖ్యమే. ఇలాంటి సమయంలో అనవసర వ్యాఖ్యలు చేసి ప్రపంచం ముందు మనలను మనం చులకన చేసుకోరాదు. ఈ విషయంలో ఖర్గే , రాహుల్ తదితరులు సంయమనం పాటించాలి. అతిగా మాట్లాడి పాకిస్థాన్‌కు ఉప్పందించే ప్రయత్నం చేయరాదు.

# భీకర ఎన్‌కౌంటర్..

మొదటిపేజీ తరువాయి..

రివార్డు ఉందని తెలిపారు. 'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం అంటూ అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో భద్రతా దళాలకు అభినందనలు తెలిపారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది' అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావును బసవరాజు, క్రిష్ణ, వినయ్, గంగన్న, బసవర రాజు, ప్రకాష్, బీఆర్, ఉమేష్, రాజు, విజయ్, కేశవ్, దారపు నరసింహారెడ్డి, నరసింహ అని మారు పేర్లతో కూడా పిలిచేవారు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్ధాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరాక స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. మిలటరీ దాడుల వ్యూహకర్తగా నంబాల కేశవరావుకు పేరుంది. మిలిటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తులు. మిలటరీ వ్యూహాల రూపకల్పన, అమలు, ఆయుధాల వ్యాపారులతో సత్సంబంధాలు నెరపడం ఆయన ప్రత్యేకతలు. దశాబ్దకాలం పాటు కేంద్ర మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. గణపతి తర్వాత పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గణపతితో పోల్చితే పార్టీ సిద్ధాంతాల అమల్లో మరింత కఠినంగా వ్యవహరించేవారు. దూకుడు స్వభావం కలిగిన కేశవరావు.. ప్రతిఘటన ద్వారానే లక్ష్యం సిద్ధిస్తుందని బలంగా నమ్మే స్వభావమని ఓ పోలీసు అధికారి తెలిపారు. అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్ మైన్స్ దాడిలో ప్రధాన సూత్రధారి నంబల కేశవరావు. ముఖ్యంగా 2010 ఏప్రిల్లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం ఆయనదే. గస్తీకి వెళ్లి తిరిగివస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు వచ్చాక మావోలు అకస్మాత్తుగా విరుచుకుపడ్డారు. జవాన్లు పారిపోయే అవకాశం కూడా దక్కలేదు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు చనిపోయారు. 2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతోపాటు మరో 27 మంది మరణించారు. ఎన్‌కౌంటర్‌లో 27మంది మావోయిస్టులను భద్రతా దళాలు కాల్చిచంపాయి. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం బీజాపూర్-నారాయణ్‌పూర్ సరిహద్దుల్లో ఉందని, కొంతమంది ఉన్నత స్థాయి కేడర్లు కూడా మరణించారని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సిఎం విజయ్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.మావోయిస్టుల సీనియర్ కేడర్ల ఉనికి గురించి నిఘావర్గాలు సమాచారం అందించాయని, నాలుగు జిల్లాల నుండి జిల్లా రిజర్వ్‌గార్డ్స్ ఆఫ్ పోలీస్ బృందాలు అభుజ్మద్ ప్రాంతంలో ఆపరేషన్ చేపట్టాయని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. పోలీస్ బృందాలపై మావోయిస్టులు ముందుగా కాల్పులు జరిపారని అన్నారు. ఎన్‌కౌంటర్ తర్వాత కూడా 50 గంటల పాటు గాలింపు కొనసాగిందని అన్నారు. ఇటీవల బీజాపూర్ కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. 21 రోజుల పాటు కొనసాగిన ఈ ఆపరేషన్ మే 11న ముగిసిందని, ఈ ఆపరేషన్‌తో మావోయిస్టుల అగ్ర నేతలు రక్షిత ప్రాంతాల నుండి మరో ప్రాంతానికి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్రమోదీ తాజాగా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను ప్రశంసించారు. 'మీ అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా. మావోయిజం ముప్పును నిర్మూలించి.. ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పేర్కొన్నారు.

## సోనియా, రాహుల్ 142 కోట్లు లబ్ధి పొందారు

మొదటిపేజీ తరువాయి..

మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, తర్వాత కూడా వారు అదే పంథాను కొనసాగించారని పేర్కొంది. బుధవారం ఢిల్లీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణలో భాగంగా ఈడీ ఈ వాదనను వినిపించింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులోభాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్నవారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే పక్రియ చేస్తున్నామని తెలిపింది. ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో (ఢిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

## మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతకు షాక్

మొదటిపేజీ తరువాయి..

చేశారు. సునీతా రావుకు ఏమైనా ఇబ్బంది ఉంటే పార్టీలో చర్చించాలి కానీ బహిరంగంగా మాట్లాడడం తప్పని.. దీనిపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని జాతీయ మహిళా కాంగ్రెస్ లేఖలో పేర్కొంది. వివరణ ఇవ్వకపోతే కాంగ్రెస్ నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని నోటీసులో అధిష్టానం స్పష్టం చేసింది. కొద్ది రోజుల క్రితం గాంధీభవన్‌లో సునీతా రావు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌పై పలు వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ చీఫ్ ఛాంబర్ ఎదుట సునీతారావు ధర్నాకు దిగారు. పది మంది మహిళా నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. కాంగ్రెస్ మహిళా నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని.. పోస్టుల విషయంలో మహిళా నాయకులను పార్టీ పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం, కార్పొరేషన్ పదవుల్లోనూ మహిళా నేతలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని విమర్శించారు. మహేష్ గౌడ్ బంధువులకే పదవులు కట్టబెడు తున్నారంటూ ఆరోపణలు గుప్పించారు. కార్పొరేషన్లు, పార్టీ కమిటీల్లో మహిళా కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సునీతారావు గాంధీభవన్‌లో ఆందోళనకు దిగారు. క్రమంలో అధికార పార్టీలో ఉంటూ పార్టీ ఆఫీసులో నిరసన చేపట్టడాన్ని అధిష్టానం తీవ్రంగా తప్పుబట్టింది. అలాగే టీపీసీసీ చీఫ్‌పై ఆరోపణలు చేయడాన్ని మహిళా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తప్పుబట్టింది. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా సునీతారావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసులు జారీ చేశారు.




# ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోడీ

మొదటిపేజీ తరువాయి..

ఇందిరా గాంధీ యుద్ధం చేసి బలమైన గుణపాఠం చెప్పారని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. పాక్ ను రెండు ముక్కలు చేసి శాస్వత గుణపాఠం చెప్పారని అన్నారు. భారత్ పై తీవ్ర వాద ముసుగులో దాడి జరిగితే ఇందిరాగాంధీ తెగువ గుర్తు చేసుకొస్తుందని అన్నారు. దాదాపు 54 ఏండ్ల తర్వాత కూడా ఉక్కు మహిళ తెగువను ప్రపంచం గుర్తు చేసుకుంటుందని అన్నారు. తీవ్రవాదంపై పోరాడటం ప్రతి భారతీయుడి కర్తవ్యమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ కేంద్రానికి అండగా నిలిచామని.. క్యాండిల్ ర్యాలీతో తెలంగాణలో కేంద్రానికి మద్ధతుగా ర్యాలీ చేశామని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా కంగ్రెస్ తో పాటు ప్రజలందరూ అండగా ఉన్నప్పటికీ.. ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయి వచ్చిన అవకాశాన్ని మోదీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. పాకిస్తాన్ విషయంలో అమెరికాకు లొంగిపోయి వెనకడుగు వేసిన మోదీ.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచక్షణ కోల్పోయి రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. మొట్టమొదట కేంద్రానికి అండగా నలిచింది తెలంణ ప్రభుత్వమని. క్యాండిల్ ర్యాలీ తీసి కేంద్రానికి, బలగాలకు అండగా నిలిచామని అన్నారు. ఆ రోజు తాము చేసిన దానికి అభినందించడానికి నోరు కూడా రాలేదని విమర్శించారు. మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం అసువులు బాసారని, రాజీవ్ విగ్రహంపై సంకుచిత ఆలోచనతో విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ రోజు దేశం అంతా ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల త్యాగాలను గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఈ దేశానికి స్వాతంత్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. దేశ ప్రజల హక్కులను, స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి అండగా నిలబడతామని ఈ సందర్భంగా సీఎం చెప్పారు.

# దేశ రహస్యాలు పాక్‌కు చేరవేత!



మొదటిపేజీ తరువాయి..

బయటకు వచ్చాయి. మరోవైపు పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో తనకు సంబంధాలు ఉన్నట్లు జ్యోతి అంగీకరించినట్లు తెలిసింది. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో తాను నిత్యం టచ్‌లో ఉండేదాన్ని ఆమె దర్యాప్తు అధికారుల ముందు ఒప్పుకున్నట్లు సమాచారం. 2023లో వీసా కోసం పాక్ హైకమిషన్‌కు వెళ్లిన సమయంలో డానిష్‌తో తొలిసారి పరిచయం ఏర్పడినట్లు వెల్లడించింది.'అవును.. పాకిస్థాన్ ఏజెంట్లతో నాకు సంబంధాలున్నాయి' అంటూ విచారణలో సంచలన వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ తరపున గూఢచర్యం చేసినట్లు ఆమె అంగీకరించిదని హిసార్ పోలీసు ప్రతినిధి తెలిపారు. ఇటీవల అరెస్ట్ అయిన హర్యానాకు చెందిన జ్యోతి మల్హోత్రా, పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లతో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఒప్పుకుందని, న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ మాజీ అధికారి డానిష్‌తో తాను తరచుగా సంప్రదింపులు జరిపిందని ఆమె ఒప్పుకున్నారన్నారు. 'ట్రావెల్ విత్ జో' అనే యూట్యూబ్ ఛానల్ ఉన్న జ్యోతి మల్హోత్రా 2023లో పాకిస్తాన్ వెళ్లడానికి వీసా పొందడానికి ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌కు వెళ్లినట్లు తెలిపింది. అక్కడ అహ్సాన్-ఉర్-రహీం అలియాస్ డానిష్‌తో పరిచయం ఏర్పడిందని, తన మొబైల్ నంబర్ తీసుకొని తరచుగా అతనితో మాట్లాడేదానినని, రెండుసార్లు పాకిస్థాన్‌కు కూడా వెళ్లానని తెలిపింది. అక్కడ డానిష్ తనకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాడని, అంతేకాకుండా తన ప్రయాణానికి కూడా ఏర్పాట్లు చేశాడని విచారణలో చెప్పింది. డానిష్ ద్వారా పరిచయమైన అలీ హసన్ అనే వ్యక్తి తనకు పాకిస్థాన్ నిఘా అధికారులుగా ఉన్న షకీర్, రాణా షాబాజ్ అనే ఇద్దరు వ్యక్తులను పరిచయం చేశాడని తెలిపింది. షకీర్ మొబైల్ నంబర్‌ను తన మొబైల్‌లో 'జాట్ రాధావన్' అనే పేరుతో సేవ్ చేసుకున్నానని.. అందువల్ల తనను ఎవరూ అనుమానించలేదని తెలిపింది. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత తాను వాట్సాప్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా పాక్ ఏజెంట్లతో టచ్‌లోనే ఉన్నానని.. ఈ క్రమంలోనే దేశానికి సంబంధించిన సమాచారాన్ని వారికి షేర్ చేసేదానినని జ్యోతి మల్హోత్ర ఒప్పుకుంది. ఢిల్లీలోని పాక్ హైకమిషన్‌లో డానిష్‌ను తాను చాలాసార్లు కలిసినట్లు తెలిపింది. త్రివిధ దళాల వివరాలను పాకిస్థాన్ నిఘా సంస్థకు చెందిన కార్యకర్తలతో, ముఖ్యంగా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌గా ఉన్న షకీర్, రాణా షాబాజ్ అనే వ్యక్తులతో అత్యంత సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు అధికారుల విచారణలో అంగీకరించింది. ఎవరికి అనుమానం రాకుండా స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో వేరే ఐడిలను ఇందుకు ఉపయోగించింది. అట్టారి, రాజస్థాన్ సరిహద్దుల్లో దళాల మోహరింపునకు సంబంధించిన రహస్య వివరాలను షకీర్‌తో షేర్ చేసినట్లు విచారణలో తాను చేసిన తప్పులను ఒప్పుకుంది.

## దేశంలో మళ్లీ కరోనా బెల్స్

మొదటిపేజీ తరువాయి..

ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి మహారాష్ట్ర లో ఏకంగా వందకుపైగా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. మొత్తం 6,066 స్వాబ్ టెస్టులు చేయగా 106 కేసులు పాజిటివ్‌గా తేలినట్లు చెప్పారు. అందులో కేవలం 101 మంది ముంబైకి చెందిన వారే ఉండటం గమనార్హం. మిగిలిన వారు థానే, పూణె, కొల్హాపూర్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 పాజిటివ్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో 16 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. జనవరి నుంచి రెండు కొవిడ్ సంబంధిత మరణాలు కూడా నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంగళవారం తెలిపింది. మరణించిన వారిలో ఒకరు క్యాన్సర్ రోగి అని పేర్కొంది. దేశంలో కొవిడ్ పరిస్థితి నియంత్రణలో ఉందని, ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు పరిస్థితిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. జలుబు, దగ్గుతో బాధపడుతున్న రోగులతోపాటు ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దవాఖానలను ఆదేశించింది.సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో కొవిడ్ పెరుగుదల తీవ్రంగా ఉంది. ఏప్రిల్ చివరి వారంలో 11వేల కేసులు సింగపూర్‌లో నమోదుకాగా, మే మొదటి వారానికి ఆ సంఖ్య 14,000 దాటింది. హాంకాంగ్‌లో మే మొదటివారంలో 1000కిపైగా కొత్త కేసులు నమోదుకాగా, 33 మంది ప్రాణాలు కోల్పోయారు. చైనాలోనూ కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని, ఫ్లూ లక్షణాలతో దవాఖానల్లో చేరే వారి సంఖ్య సాధారణం కంటే రెట్టింపు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆసియా దేశాల్లో ప్రస్తుతం వైరస్ వ్యాప్తికి జేఎన్.1, దాని సబ్‌వేరియంట్‌లే కారణమని అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉన్నదని సింగపూర్ తెలిపింది.



## పాక్ హైకమిషన్ కార్యాలయంలో మరో అధికారిపై వేటు

దేశం విడిచి వెళ్లాలని విదేశాంగ శాఖ ఆదేశం

న్యూఢిల్లీ,మే21(సాక్ష్యం): గూఢచర్యానికి పాల్పడుతున్నారనే అభియోగంపై ఇటీవల ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ కార్యాలయానికి చెందిన ఓ అధికారిని కేంద్రం బహిష్కరించింది. తాజాగా మరో అధికారపైనా వేటేసింది. మరో అధికారి తీరుపైనా భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన్ను దేశం నుంచి బహిష్కరించిన కేంద్రం.. 24గంటల్లోగా భారత్‌ను వీడి వెళ్లాలని ఆదేశించింది. సదరు అధికారి తన హోదాకు తగినట్లుగా నడుచుకోనందువల్ల ఈ తరహా చర్యలు తీసుకున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. ఎనిమిది రోజుల వ్యవధిలో పాక్ హైకమిషన్‌లోని అధికారి బహిష్కరణకు గురికావడం ఇది రెండోసారి.పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్(క్షూ।సజీబితినీని ÷ూతినిటనీనీస) పేరిట పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులు జరిపిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య సైనికపరమైన ఉద్రిక్తతలు తలెత్తి, సద్దుమణిగిన నేపథ్యంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. అయితే, సదరు అధికారిపై అభియోగాలు ఎలాంటివనేది మాత్రం విదేశీ వ్యవహారాల శాఖ నిర్దిష్టంగా పేర్కొనలేదు.

## నోటీసులు అందాక స్పందిస్తా..

**విచారణకు హాజరవుతా..**
**కావాలనే కాళేశ్వరం విచారణ జాప్యం**
**ఇంకెంతకాలం విచారణ చేయిస్తారు?**
**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**

హైదరాబాద్,మే21(సాక్ష్యం): కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణను కాలయాపన చేస్తూ..కేసును నీరు గారుస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇంకెంతకాలం విచారిస్తారని అన్నారు. ఇదంతా కావాలనే చేస్తున్నట్లుగా ఉందని అన్నారు. ఇక తనకు నోటీసులపై స్పందిస్తూ విచారణకు వందశాతం హాజరవుతానని రాజేందర్ స్పష్టం చేశారు. అయితే ఇంత వరకు ఎలాంటి నోటీసులు తనకు అందలేదని ఆయన తెలిపారు. అయితే తనకు నోటీసులు పంపిన విషయం మీడియా ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. తనకు నోటీసులు అందిన అనంతరం ఈ విషయాన్ని పార్టీలో చర్చించి.. అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా తాను ముందుకు వెళ్తానన్నారు. బుధవారం ఎంపీ ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నీది.. నువ్వు ఎలాంటి విచారణ అయినా చేయి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. గతంలో దేవరాయాంజాల్ భూముల విషయంలో కేసీఆర్ చేసిన తప్పే.. నేడు నువ్వు చేస్తున్నావంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ మండిపడ్డారు. నువ్వు మమల్ని బెదిరిస్తే భయపడమన్నారు. కేంద్రంలో తమ పార్టీనే అధికారంలో ఉందని ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. నీ చిట్టా అంతా తమ చేతిలో ఉందన్నారు. నీ దిక్కుమాలిన చిల్లర గాళ్ళతో మాట్లాడిస్తే తాను వెనక్కి పోనంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ బ్యారేజీని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే ఈ బ్యారేజీలోని పలు పిల్లర్లు 2023లో కుంగాయి. ఈ అంశం నాటి ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాస్త్రంగా మలుచుకుంది. 2024లో ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము అధికారంలోకి వస్తే.. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో ఈ బ్యారేజీ నిర్మాణంపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇక ఆ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. నంతరం ఈ అంశంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి పీసీ ఘోష్ సారథ్యంలో విచారణ కమిషన్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ విచారణలో భాగంగా పలువురు ఉన్నతాధికారులతోపాటు సిబ్బందిని సైతం ప్రశ్నించింది. అలాగే పలువురు స్వచ్ఛందంగా ఈ విచారణకు హాజరై.. పలు విషయాలను జస్టిస్ పీసీ ఘోష్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్‌తోపాటు ఆయన కేబినెట్‌లో మంత్రులుగా వ్యవహరించిన హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ నోటీసులు జారీ చేసింది. జూన్ 5వ తేదీన కేసీఆర్, జూన్ 6వ తేదీన హరీశ్ రావు.. అలాగే జూన్ 9వ తేదీన ఈటల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని ఆ నోటీసుల్లో కమిషన్ స్పష్టం చేసింది. కేసీఆర్ కేబినెట్‌లో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ పని చేసిన సంగతి తెలిసిందే.

## మనదేశ సైనికులకు సంఘీభావంగాహో నర్సంపేటలో తిరంగా ర్యాలీ

నర్సంపేట మే21 (సాక్ష్యం న్యూస్ ) :
వర్షాన్ని సైతం లెక్కచేయకుండానర్సంపేటలో బుధవారం సాయంత్రం నిర్వహించిన దేశం కోసం మనమై సాగిన తిరంగా యాత్ర విజయవంతమైంది. మన దేశ సైనికులకు సంఘీభావంగా నర్సంపేట పట్టణంలో అమరవీరుల స్థూపం నుండి అంబేద్కర్ కూడలి వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు.ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టి, పాకిస్తాన్ దాడిని తిప్పి కొట్టి, తమ ప్రాణాలను







సైతం లెక్క చేయకుండా భారత దేశ క్షేమం కోసం,హాభారతీయుల రక్షణ కోసం పోరాడిన వీర సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ, వందే మాతరం అంటూ తల్లి భరతమాతహాపాదాలను ముద్దాడిన నర్సంపేట వాసులు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏప్రిల్ 22న జమ్మూ-కశ్మీర్ లోని పహల్గాంలో పర్యాటకులపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడిచేసి 26 మందిని అత్యంత క్రూరంగా కాల్చిచంపేశారు. దేశ సమగ్రతకు సవాల్ గా నిలిచిన ఈ ఘటనకు కారణమైన వారిని వదిలిపెట్టేదిలేదని, ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని భారత ప్రధాని నరేంద్ర మోదీ గట్టి హెచ్చరిక చేశారు. అనంతరం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ లోని 9 ఉగ్రవాదస్థావరాలను భారత సైనికులు అత్యంత చాకచక్యంగా, సమర్థంగా ధ్వంసం చేశారు. సింధూ నది జలాలను నిలిపేసి పాక్ కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది. గతంలో ఉగ్రదాడుల తర్వాత కేవలం క్యాండిల్ వెలిగించి నివాళులు అర్పించి వదిలేసేవారు. ఇప్పుడు భారతదేశం అంటే ఉగ్రవాదులకు భయం పుట్టాలనేలా ప్రధాని మోదీ గట్టి సమాధానమిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భారత మాజీ సైనికులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖ వ్యాపారవేత్తలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

### మరిపెడ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జాటోత్ సురేష్ నాయక్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మే 21 (సాక్ష్యం న్యూస్)
దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని మరిపెడ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జాటోత్ సురేష్ నాయక్



అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం మరిపెడ పట్టణంలోని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి అఫ్సర్,ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ రవికాంత్,మరిపెడ పట్టణ యువ నాయకుడు బంక ప్రమోద్,యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీతేజావత్ అఖిల్ నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళి

న్యూఢిల్లీ,మే21(సాక్ష్యం):
భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నేడు 34వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. రాజీవ్ తనయుడు, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతోపాటు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గేలు ఢిల్లీలోని వీర్ భూమి రాజీవ్ స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. వీరితోపాటు కాంగ్రెస్ నేత సచిన్ పైలట్, ఇతర కాంగ్రెస్ నేతలు కూడా స్మారక ప్రదేశంలో రాజీవ్‌కి ఘనంగా నివాళు లర్పించారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆయనను భారతదేశ ముద్దుబిడ్డ అని అభివర్ణించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలని ప్రస్తావిస్తూ ఖర్గే ఎక్స్ పోస్టు చేశారు. రాజీవ్‌గాంధీ నేతృత్వంలోనే 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం,



పంచాయతీరాజ్‌ను బలోపేతం చేయడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే టెలికాం, ఐటి విప్లవానికి నాయకత్వం వహించారు. కంప్యూటరీకరణను అమలు చేశారు. సమ్మిళిత అభ్యాసంపై దృష్టి సారించిన కొత్త విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే. రాజీవ్‌గాంధీ లక్షలాది మంది భారతీయులలో ఆశను ప్రేరేపించారు. 21వ శతాబ్దపు సవాళ్లు, అవకాశాలకు భారతదేశాన్ని సిద్ధం చేయడంలో ఆయన దార్శనికత, సాహసోపేతమైన నిర్ణయాలు కీలకపాత్ర పోషించాయి అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.
÷రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రాహుల్ తన తండ్రి రాజీవ్‌తో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ ఫొటోకు జతగా 'నాన్న మీ జ్ఞాపకాలు నన్ను ప్రతి అడుగులోనూ నడిపిస్తాయి. మీ నెరవేరని కలలను నిజం చేయడమే నా సంకల్పం. నేను వాటిని ఖచ్చితంగా నెరవేరుస్తాను' అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.
÷రాజీవ్‌గాంధీ 40 ఏళ్ల వయసులోనే ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అక్టోబర్ 1984 నుంచి 1989 డిసెంబర్ 2 వరకు ఆయన ప్రధానిగా ఉన్నారు. తమిళ ఈలం ఆత్మాహుతి దాడిలో ఆయన దుర్మరణం చెందారు.

# హైదరాబాద్‌లో పలు చోట్ల భారీ వర్షం

మొదటిపేజీ తరువాయి..

వర్షం పడుతోంది. దీంతో పలుచోట్ల రహదారులపై నీరు నిలిచింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉండగా వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం పడింది. వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలతో పాటు రహదారులు జలమయమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురియడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా వర్షం పడింది. వర్షం ధాటికి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతుండటంతో జీహెచ్‌ఎంసీ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షం దంచికొట్టింది. ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షం పడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, నెల్లికుదురు, ఇనుగుర్తి, బయ్యారం, డోర్నకల్, మరిపెడ, నర్సంపేట, నర్సింహులపేటలో భారీ వర్షం కురుస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం మేఘావృతమైంది. భారీ వర్షం కురుస్తోండటంతో ఎండల నుంచి



ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్, కోదాడ, నల్లబండగూడెం, హుజూర్‌నగర్, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోంది. సూర్యాపేట జిల్లాలోని నల్లబండగూడెం సమీపంలో ఓ చెట్టు కింద మేకల మందపై పిడుగు పడటంతో 39 మేకలు మృతిచెందాయి. అయితే మరో ఐదు రోజులు భారీ వర్షసూచన ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గురువారం కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు వరంగల్, సూర్యాపేట జిల్లాల్లో వర్షం కురుస్తోంది. నర్సంపేట, ఖానాపురం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్నాయి. బుధవారం తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్‌తో పాటు సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉంది. పలుచోట్లు పిడుగులు పడే అవకాశం ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది.

## నెలాఖరులోగా రుతుపవనాల రాక

మొదటిపేజీ తరువాయి..

దృష్టిలో ఉంచుకొని, ముందస్తుగానే ఈసారి 12 స్టేట్ డిసాస్టర్ రిలీఫ్ ఫోర్స్ లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఒక్కో టీమ్ లో తెలంగాణా స్పెషల్ పోలీస్ కు చెందిన 100 సుశిక్షితులైన పోలీసులు ఉంటారని, ఈ బృందాలను రాష్ట్రంలోకి పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేశామని చెప్పారు. తద్వారా, ఎక్కడైనా భారీ వర్షాలు, తుఫానులు వచ్చినా, వెంటనే సమీపంలోని ఎన్‌డిఆర్ఎఫ్ ఈ బృందాలు చేరుకుంటాయని కలెక్టర్లకు తెలిపింది. దీనితో పాటు, ఈ సారి 3 ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భారీ వర్షాలు వచ్చే జిల్లాల్లో ఈసారి ప్రత్యేకంగా అదనపు బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఔఆఖీఈ కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్న అన్ని ఫైర్ స్టేషన్లలో సిబ్బందికి ప్రత్యేకంగా విపత్తుల నివారణ చర్యలపై శిక్షణను ఇప్పించామని అన్నారు. హైదరాబాద్ తోపాటు శివారు ప్రాంతాలకు తక్షణమే స్పందించేలా హైడ్రా బృందాలను ఏర్పాటు చేసాం. భారీ వర్షాలు, ఆకస్మిక వర్షాలు వస్తే నష్టాలను తగ్గించడానికి పై చర్యలు ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశముంటే, సంబంధిత జిల్లాలకు కేటాయించిన బృందాలతో టచ్ లో ఉండాలని ఆయా బృందాల వివరాలు సంబంధిత అధికారులకు కూడా ఇవ్వాలని సూచించారు. అప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల ఫైర్ ఆఫీసర్లతో సంప్రదిస్తూ, స్టేట్ డిజాస్టర్ ఫోర్స్ సేవలను పొందాలని, అత్యవసర పరిస్థితుల్లో ఔఆఖీఈ సేవలు కావాలంటే స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖతో టచ్ లో ఉండాలని పేర్కొన్నారు. విపత్తుల నివారణలో సుశిక్షితులైన సింగరేణి కాలరీస్ సిబ్బంది సేవలను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. తమ జిల్లాలోని వరదలు, వర్షాల వల్లముంపు ప్రాంతాలు, ఇతర సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు.

## బలూచీలో పెట్రేగిన ఉగ్రవాదులు

### స్కూలు బస్సు లక్ష్యంగా పేలుళ్లు
### నలుగురు చిన్నారుల మృత్యువాత

న్యూఢిల్లీ,మే21(సాక్ష్యం): ఉగ్రవాదులు మరోసారి అమాయక ప్రజలపై దాడులకు పాల్పడ్డారు. పాకిస్థాన్ లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఒక స్కూల్ బస్సును లక్ష్యంగా చేసుకుని బాంబు దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురు పిల్లలు అక్కడికక్కడే మరణించగా, మరో 38 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ పేలుడును అక్కడి హోంమంత్రి మొహ్సిన్ నక్వీ తీవ్రంగా ఖండించారు. మరోవైపు అధికారులు ఈ దాడి ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం ప్రకారం, స్కూల్ బస్సు పిల్లలను తీసుకెళ్తున్నప్పుడు ఈ దాడి జరిగింది. పేలుడు జరిగిన వెంటనే సహాయ, రక్షణ చర్యలు ప్రారంభమయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన పిల్లలను క్వెట్టా, కరాచీలోని పెద్ద ఆసుపత్రులకు తరలించారు. పాకిస్థాన్ హోం మంత్రి మొహ్సిన్ నక్వీ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ పిల్లలను లక్ష్యంగా చేసుకునే ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్ట బోమన్నారు. దేశంలో భయాన్ని, అస్థిరతను వ్యాప్తి చేయడమే వారి దాడి ఉద్దేశమని, అయితే ప్రభుత్వం, భద్రతా దళాలు వీటిని విజయవంతం చేయనివ్వవని వెల్లడించారు. బలూచిస్తాన్ చాలా కాలంగా పాకిస్థాన్?కు అత్యంత సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతంగా ఉంది. ఇక్కడి వేర్పాటువాద శక్తులు పాకిస్థాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశాన్ని కోరుతున్నాయి. ఈ క్రమంలో అనేకసార్లు పాకిస్థాన్ సైన్యాన్ని, పలువురని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో ఈ ప్రాంతంలో ఉగ్రవాద ఘటనల సంఖ్య భారీగా పెరగడం విశేషం. ఈ క్రమంలోనే బలూచిస్తాన్‌లో జరిగిన ఈ ఆత్మాహుతి దాడి పాకిస్థాన్ అంతర్గత భద్రతపై మరోసారి ప్రశ్నలను లేవనెత్తింది. గత కొద్ది సంవత్సరాలుగా ఈ ప్రాంతం బలోచ్ వేర్పాటువాదులకదలికలతో దద్దరిల్లిపోతోంది. ముఖ్యంగా బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ పేరుతో విప్లవకారులు పదే పదే పేలుళ్లు, కాల్పుల ద్వారా ప్రభుత్వాన్ని గడగడలాడిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం కిల్లా అబ్దుల్లా నగరంలోని మార్కెట్ వద్ద కార్ బాంబ్ పేలుడులో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇది ఒక్కటే కాదు, మార్చిలో జరిగిన ఘోర ఘటనలో, ఓ రైలు పై దాడి చేసి 33 మందిని, ప్రధానంగా సైనికులను హతమార్చింది.


**బహిరంగ ప్రకటన**

న్యాయపరమైన అభిప్రాయము కొరకు శ్రీ చక్కలి బందయ్య గారు, **వికారాబాద్** జిల్లా, పరిగి మండలము మరియు మున్సిపాలిటీ, పరిగి గ్రామములో గల సర్వే నెంబరు. 265 లోని ప్లాట్ నెంబరు 94 పై నిర్మించిన ఇంటి నెంబరు 9-276/14/సి, మొత్తము విస్తీర్ణము 83.32 చదరపు గజములలో (8.34 చదరపు గజాలు రోడ్డు ప్రభావిత ప్రాంతాన్ని తొలగించిన తర్వాత), ఇట్టి ఇంటి యొక్క విస్తీర్ణం 1199.88 చదరపు అడుగులు, **వారికి** విక్రయ దస్తావేజు నెం. 2563/2024, తేది: 23-10-2024, రిజిస్టర్ కార్యాలయం పరిగిలో రిజిస్టర్ అయిన పత్రం ద్వారా సంక్రమించినది, **వారు** దాఖలు చేయబడిన డాక్యుమెంట్లలో (1) 29.09.2016 తేదితో కలిగిన విక్రయ దస్తావేజు, డాక్యుమెంట్ నెం. 3577/2016, (వ్రాయించి యిచ్చినవారు: **శ్రీమతి సబిహ సుల్తానా, వ్రాయించు కున్నవారు: యం.డి. ఖలీల్ గారు**), రిజిస్టర్డ్ ఆఫీస్ పరిగిలో రిజిస్టర్ అయిన లింకు డాక్యుమెంట్లు యొక్క సర్టిఫైడ్ కాపి ఉన్నది. విచారణలో ఒరిజినల్ కనిపించుట లేదని తెలియవచ్చినది. కావున ఇట్టి డాక్యుమెంట్ అక్రమంగా స్వాధీనంలో కలిగియున్న వ్యక్తి/వ్యక్తులతో వ్యవహరించరాదని సామాన్య ప్రజలు ఇందుమూలముగా హెచ్చరించబడి యున్నారు. ఎవరైన వ్యక్తి/వ్యక్తులు పై ఆస్తికి సంబంధించి కనిపించని డాక్యుమెంట్ ఏ విధమైన వ్యవహారము నిర్వహించిననూ వారి స్వంత బాధ్యతపై చేయవలెను మరియు అట్టి వ్యవహారము గుర్తించబడదు.
సదరు ఆస్తిపై ఎవరికేని, ఏదేని క్లెయిము, ఆసక్తి, ఆక్షేపణ కలిగినచో సదరు దానిని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 15 దినముల లోపుగా దిగువ సంతకం దారుకు తెలియ చేయవలెను, లేనిచో సదరు ఆస్తిపై తదుపరి ఎట్టి క్లెయిమూ పరిశీలించబడదు.

**మేరెడ్డి నర్సింహ్మా రెడ్డి, అడ్వకేట్**
**ఇంటి నం. 11-13-194/1/4,**
**ప్లాట్ నం. 5, రోడ్ నం. 3,**
**గ్రీన్ హిల్స్ కాలనీ, కొత్తపేట,**
**రంగారెడ్డి జిల్లా.**
**ఫోన్ నం. 6301426732**

**బహిరంగ ప్రకటన**

న్యాయపరమైన అభిప్రాయము కొరకు **శ్రీమతి తమ్మలి గీతారాణి, భర్త: టి. సత్యనారాయణ,** సంగారెడ్డి జిల్లా (పూర్వం మెదక్ జిల్లా), సంగారెడ్డి మండలం, కల్పకుంట్ల గ్రామంలో గల 242/1, 243 మరియు 244/2 సర్వే నెంబర్లతో ఉన్న ప్లాట్ నెం. 42/1, యొక్క విస్తీర్ణం 97.77 చదరపు గజాలు, కలిగిన దానిపై నూతన ఇంటి నిర్మాణం కొరకు ఋణం పొందుటకు, సంగారెడ్డికి చెందిన దరఖాస్తు కలిగిన దానిని క్యాన్పిన్ హోంస్ ఫైనాన్స్ లిమిటెడ్ నాకు అప్పగించినదని, యావద్మంది ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, దాఖలు చేయబడిన డాక్యుమెంట్లలో (1) 02.07.2013 తేదీతో కలిగిన విక్రయ దస్తావేజు, డాక్యుమెంట్ నెం. 14125/2013, **(అమ్మినవారు: శ్రీమతి డాకూరి ప్రమీల, కొన్నవారు: శ్రీమతి తమ్మలి గీతా రాణి),** రిజిస్టర్డ్ ఆఫీస్ సంగారెడ్డిలో రిజిస్టర్ అయిన దరఖాస్తుదారుడి డాక్యుమెంట్ యొక్క సర్టిఫైడ్ కాపీ ఉన్నది. విచారణలో ఒరిజినల్ కనిపించుట లేదని తెలియవచ్చినది. డాక్యుమెంట్ అక్రమంగా స్వాధీనంలో కలిగియున్న వ్యక్తి/వ్యక్తులతో వ్యవహరించ రాదని సామాన్య ప్రజలు ఇందుమూలముగా హెచ్చరించబడియున్నారు. ఎవరైన వ్యక్తి/వ్యక్తులు పై ఆస్తికి సంబంధించి కనిపించని డాక్యుమెంట్లతో ఏ విధమైన వ్యవహారము నిర్వహించిననూ వారి స్వంత బాధ్యతపై చేయవలెను మరియు అట్టి వ్యవహారము గుర్తించబడదు.
సదరు ఆస్తిపై ఎవరికేని, ఏదేని క్లెయిము, ఆసక్తి, ఆక్షేపణ కలిగినచో సదరు దానిని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 15 దినముల లోపుగా దిగువ సంతకం దారుకు తెలియ చేయవలెను, లేనిచో సదరు ఆస్తిపై తదుపరి ఎట్టి క్లెయిమూ పరిశీలించబడదు.

**మేరెడ్డి నర్సింహ్మా రెడ్డి, అడ్వకేట్**
**ఇంటి నం. 11-13-194/1/4,**
**ప్లాట్ నం. 5, రోడ్ నం. 3,**
**గ్రీన్ హిల్స్ కాలనీ, కొత్తపేట,**
**రంగారెడ్డి జిల్లా.**
**ఫోన్ నం. 6301426732**


## కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి..

నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు గాలికొదిలి తమకు నోటీసులిస్తున్నారని, దిక్కుతోచని పరిస్థితుల్లోనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని కెటిఆర్ మండిపడ్డారు. ప్రజాపాలన కమిషన్ల పాలనగా మారిందని ధ్వజమెత్తారు. కమిషన్లు తప్ప రేవంత్ ప్రభుత్వానికి పాలన చేతకాదు అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్లపై మాట్లాడుతున్నారని, ఎన్ని నోటీసులు ఇచ్చినా దూదిగింజల్లా ఎగిరిపోతాయన్నారు. కాళేశ్వరం దర్యాప్తు కీలక దశకు చేరుకున్న సందర్భంగా మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లు విచారణకు రావాలని జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నోటీసులు జారీచేసింది. ముగ్గురు హాజరయ్యేందుకు 15 రోజులు గడువును కమిషన్ ఇచ్చింది. కమిషన్ ఎదుట హాజరై కమిషన్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని జస్టిస్ పిసి ఘోష్ ఈ నోటీసుల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదు.. కమిషన్ల పాలన అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత 17 నెలలుగా పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలు ఆడుతోంది అని ధ్వజమెత్తారు. కమిషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదు. పాలన కనిపించడం లేదు. డైరెక్ట్‌గా కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్‌లు లేనిదే పనులు జరుగడంలేదు అని స్వయంగా చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని అడుగుతున్నా.. ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ కూలింది, 8 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేకపోయింది. మీ కమిషన్‌ల ఆరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి సైతం సాహసం చేయలేకపోయారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. నల్గొండలో సుంకిశాల ప్రాజెక్ట్ కూలింది, ఇప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి.. కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలిగొంటున్నారు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయి. నిజాయితీ ఎప్పటికీ ఓడిపోదు. మీరు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని చేతకాని



ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది? 4 వేల రూపాయల పింఛన్లు ఏమయ్యాయి? మీరు ఎన్ని నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరిపోతాయి. మీవి అన్ని చిల్లర ప్రయత్నాలు మాత్రమే. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించనున్నారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి. ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు.


यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

**మెహదీపట్నం బ్రాంచ్,** 13-6-434/c/139 & 139/1,
**సయ్యద్ ప్లాజా, పిల్లర్ నం. 84, క్రిస్టల్ గార్డెన్ ఎదురుగా,**
**మారుతి నగర్, మెహదీపట్నం, హైదరాబాద్-500 008.**

**సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు**

**Ref: DN/VIJ/03/25-26**
తేది: 05.05.2025 ప్రదేశం: హైదరాబాద్

**టు, 1. రుణగ్రహీత/లు: 1(ఎ) శ్రీ ఆర్ విజయ భారతి** ఫ్లాట్ నం. 307, 3వ అంతస్తు, మీనాక్షి రెసిడెన్సీ, ప్లాట్ నం. 239, ఈస్టర్న్ పార్క్, సర్వే నం. 95, 96, 97, 98 & 99, బడంగ్‌పేట్ విలేజ్, నగర పంచాయతీ, సరూర్‌నగర్ మండలం, ఆర్ ఆర్ జిల్లా తెలంగాణ-500058. **1(బి) శ్రీ రామరాజు రాజరంగారావు** ఫ్లాట్ నం. 307, 3వ అంతస్తు, మీనాక్షి రెసిడెన్సీ, ప్లాట్ నం. 239, ఈస్టర్న్ పార్క్, సర్వే నం. 95, 96, 97, 98 & 99, బడంగ్‌పేట్ విలేజ్, నగర పంచాయతీ, సరూర్‌నగర్ మండలం, ఆర్ ఆర్ జిల్లా తెలంగాణ-500058.
**2. గ్యారంటర్/లు: 2(ఎ) శ్రీ రాంచందర్ పి** తండ్రి శ్రీ పృద్వీధర్ రావు, ఫ్లాట్ నం. 201, దత్త కైలాస్ టవర్స్, న్యూ సాయి నగర్, పీర్జాదిగూడ, హైదరాబాద్, తెలంగాణ-500039. **2(బి) శ్రీమతి రామరాజు విజయ లక్ష్మి** భర్త జి గోపి కిషన్, ఫ్లాట్ నం. 201, దత్తకైలాస్ టవర్స్ , న్యూ సాయి నగర్, పీర్జాదిగూడ, హైదరాబాద్, తెలంగాణ-500039.

సర్/మేడమ్,
**సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13 (3) తో చదవబడిన సెక్షన్ 13(2) కింద నోటీసు**
ఇక్కడ చిరునామాదారు నంబర్ 1 అయిన మీరు మా మెహదీపట్నం బ్రాంచ్ నుండి కింది క్రెడిట్ సౌకర్యాలను పొందారు మరియు బకాయిలు/వాయిదాలు/వడ్డీ/ఖాతాలను సంతృప్తికరంగా చెల్లించడంలో విఫలమయ్యారు మరియు అందువల్ల, ఆదాయ గుర్తింపు మరియు ప్రుడెన్షియల్ అకౌంటింగ్ నిబంధనలకు సంబంధించిన RBI మార్గదర్శకాల ప్రకారం, మీ ఖాతా/లు **30-04-2025** నాటికి నిరర్థక ఆస్తిగా ప్రకటించబడ్డాయి. **05/05/2025** నాటికి **రూ. 15,83,923.58 (రూపాయలు పదిహేను లక్షల ఎనభై మూడు వేల తొమ్మిది వందల ఇరవై మూడు మరియు యాభై ఎనిమిది పైసలు మాత్రమే)** మీ ఖాతా/లలో బకాయి ఉన్నాయి.
పైన పేర్కొన్న ఖాతా/ల విషయంలో మీ నంబర్ 1 నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన మొత్తం వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

| ఫెసిలిటి రకం | 30/04/2025 నాటికి బకాయి ఉన్న మొత్తం | 31/11/2024 నుండి 05/04/2025 వరకు విధించని వడ్డీ | పీనల్ ఇంటరెస్ట్ (సింపుల్) | బ్యాంక్ చేసిన ఖర్చు/ ఛార్జీలు | మొత్తం బకాయిలు |
|---|---|---|---|---|---|
| 554006650000092 | రూ.15,13,867.64 | రూ.70,055.94 | 0.00 | 0.00 | రూ.15,83,923.58 |
| | | | | మొత్తం బకాయిలు | రూ.15,83,923.58 |

బ్యాంకుకు రావాల్సిన డబ్బులు లేదా డబ్బులను తిరిగి చెల్లించడానికి, శ్రీమతి ఆర్ విజయ భారతి మరియు శ్రీ రామరాజు రాజరంగారావు 9/12/2013న పత్రాలను సమర్పించడం ద్వారా సెక్యూరిటీ ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేయడం జరిగింది: **తనఖాగా ఉంచిన ప్రాపర్టీ వివరాలు దిగువన పేర్కొనడం జరిగింది:** రంగా రెడ్డి జిల్లా, సరూర్ నగర్ మండలం, బడంగ్‌పేట్ గ్రామంలో ప్లాట్ నంబర్ 95,96,97,98 మరియు 99లోని "మీనాక్షి రెసిడెన్సీ"లోని 3వ అంతస్తులోని డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ నం. 307, సాధారణ ప్రాంతంతో సహా 950 చదరపు అడుగుల ప్లింత్ వైశాల్యంతో పాటు, 682.5 చదరపు గజాలలో 27.28 చదరపు గజాల విభజించబడని భూమితో సహా మొత్తం శ్రీమతి ఆర్ విజయ భారతి భర్త శ్రీ రామరాజు రాజరంగారావుకు చెందిన డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ మరియు సరిహద్దుగా ఉత్తరం: కారిడార్, దక్షిణం: పాసేజ్ లేదా ఫ్లాట్ నం. 305, తూర్పు: ఓపెన్ టు స్కై, పశ్చిమం: ఫ్లాట్ నం. 306 సరిహద్దులో ఉంది.
అందువల్ల, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002లోని సెక్షన్ 13(2) ప్రకారం, మీరు అమలు చేసిన రుణ పత్రాల నిబంధనలు మరియు షరతుల ప్రకారం ఒప్పంద రేటు ప్రకారం రూ.15,83,923.58 మొత్తాన్ని అదనపు వడ్డీ మరియు ఛార్జీలతో కలిపి చెల్లించాలని మరియు ఈ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు మీ బాధ్యతలను పూర్తిగా తీర్చాలని మిమ్మల్ని ఇందుమూలంగా కోరుతున్నారు. అలా చేయకపోతే, పేర్కొన్న చట్టం కింద ఇవ్వబడిన ఏవైనా లేదా అన్ని హక్కులను వినియోగించుకోవడం ద్వారా పైన పేర్కొన్న సెక్యూరిటీలను అమలు చేయడానికి మేము చర్యలకు ఉపక్రమిస్తాము. చట్టంలోని సెక్షన్ 13 (13) ప్రకారం, ఈ నోటీసు అందిన తర్వాత, బ్యాంకు అనుమతి లేకుండా పైన పేర్కొన్న సెక్యూరిటీలను డిస్పోజ్ చేయకుండా లేదా వాటితో వ్యవహరించకుండా మీరు నిరోధించబడ్డారు. సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి SARFAESI సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై దృష్టిని సారించాల్సిందిగా మిమ్మల్ని కోరుతున్నాము.

**అధీకృత అధికారి**

## టిజి ఆర్ జె సి ఫలితాలలో జయ ప్రభంజనం

**కోదాడ మే 21 (సాక్ష్యం):**
టిజి ఆర్ జె సి ఫలితాలలో జయ పాఠశాల ప్రభంజనం సృష్టించింది అని పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా





విద్యార్థిని నీ అభినందిస్తూ మాట్లాడారు. ఈ నెల 10న తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన టీజీ ఆర్ జె సి పరీక్షలో కోదాడ జయ పాఠశాలకు చెందిన ఇఫ్రా తస్నీమ్ రాష్ట్ర స్థాయిలో 150 మార్కులకు గాను 138 మార్కులు సాధించి 4వ ర్యాంకు సాధించింది. ఈ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాలోని 301 కేంద్రాలలో నిర్వహించారు. ఇంతటి ఘనత సాధించిన తమ విద్యార్థిని విజయానికి సహకరించిన ఉపాధ్యాయ బృందాన్ని , తల్లిదండ్రులను పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు ప్రధానోపాధ్యాయులు చిలువేరు వేణు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

### అవగాహన సదస్సు కల్పించిన పాస్టర్ యేసయ్య

కోదాడ మే 21 (సాక్ష్యం)
యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బాప్టిస్ట్ చర్చి పాస్టర్ యునైటెడ్ అసోసియేషన్ అధ్యక్షుడు యేసయ్య బుధవారం అన్నారు.







యువత సోషల్ మీడియా ప్రలోభానికి గురి కాకుండా బాప్టిస్ట్ చర్చిలో అవగాహన సదస్సు కల్పించామని తెలిపారు. అనంతరం మాట్లాడుతూ... మద్యం డ్రగ్స్ చెడు వ్యసనాలకు యువత చెడిపోతుందని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ శ్రీనివాస్ రావు,యలమర్తి శౌరి, పూర్ణ శశికాంత్, యాతాకుల జ్యోతి, ఒంటెపాక జానకి, బొల్లికొండ కోటయ్య, శ్యాం బాబు, మేరమ్మ,సీత శార సునీత, సలోమి, మెసేస్ రాంబాబు ఎనోష్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబంలో పిడుగుపాటు

### పిడుగుపాటుకు 34 మేకలు మృతి
### తీవ్ర విషాదంలో కుటుంబ సభ్యులు

**కోదాడ మే 21 (సాక్ష్యం):**
రేక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. మేకలే వారికి జీవనాధారం.





అలాంటి నిరుపేద కుటుంబంలో పిడుగుపాటు పడింది. ఏకంగా 34 మేకలు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామానికి చెందిన బడుగుల లక్ష్మణ్ కు 40 మేకలు ఉండేవి. రోజు వాటిని మేపుకొని ఇంటికి వచ్చేవారు.అదే క్రమంలో బుధవారం కూడా గ్రామ శివారులో మేకలను మేపడానికి తీసుకువెళ్లారు. అకాల వర్షానికి పిడుగుపాటు పడి 34 మేకలు మృతి చెందాయి. మృతిచెందిన మేకలు విలువ సుమారు 6 లక్షల ఉంటాయని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

## భారత్ లో సాంకేతిక విప్లవానికి నాంది రాజీవ్ గాంధీ

### ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

ఖానాపురం మే21 (సాక్ష్యం న్యూస్ ) :
దేశానికి సాంకేతికతను తీసుకుని వచ్చి ప్రపంచంలో టెక్నాలజీ విప్లవంలో భారత్ ను నిలిపింది రాజీవ్ గాంధీనేనని నర్సంపేట మార్కెట్ వైస్ ఛైర్మన్ కాంగ్రెస్ పార్టీ ఖానాపురం మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు ,నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్ల జగన్ మోహన్ రెడ్డి లు అన్నారు.
అధ్యక్షులు హరిబాబు ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని ,భారతరత్న సర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని రాజీవ్‌గాంధీ వర్ధంతి ని పురస్కరించుకుని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు.రాజీవ్ గాంధీ 90వ దశకంలోనే భారత దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ని భారత దేశానికి తీసుకొచ్చారని, మన దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. అలాగే మన దేశంలో



18 సంవత్సరాలకే ఓటు హక్కును కల్పించిన గొప్ప వ్యక్తి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో మనమందరం నడువాల్సిన అవసరం ఉ ఒదన్నారు. ఈకార్యక్రమంలో ఖానాపురం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జగన్ , ఖానాపురం మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు వల్లే శ్రీనివాస్ , మండల కాంగ్రెస్ పార్టీ ఎస్ టీ సెల్ అధ్యక్షులు భాను ప్రసాద్ , మండల కాంగ్రెస్ పార్టీ సహాయక కార్యదర్శి రాజ్ కుమార్ , ఖానాపురం గ్రామ పార్టీ అధ్యక్షులు యడ్ల బిక్షం రెడ్డి, బుధరావుపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్ కె లాల్ సాహెబ్ ,రంగాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిండి కుమార్ , కోడ్తిమాట్ తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణ ,చాంద్ పాషా,కోరే రాములు,నాంచారి కుమార్, సురేష్, త్రిపురనేనీ కోటయ్య, అరే సంపత్, రంగు కుమారస్వామి, మాజీ సర్పంచ్ పూల్య, రమేష్ , సుధాకర్ , యుగంధర్ , సతీష్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

జనగామ జిల్లా బ్యూరో. సాక్ష్యం న్యూస్:
కొడకండ్ల మండలంలోని



రామన్నగూడెం గ్రామ అభివృద్ధి దిశగా మరో ముందడుగు పడింది. గ్రామంలో సుమారు రూ. 80 లక్షల వ్యయంతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మరియు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నిర్మించనున్న సీసీ రోడ్లు మరియు సీసీ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి పాల్గొని బుధవారం రోజున శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యతగా నిలుస్తోందని చెప్పారు.
గ్రామాల్లో రవాణా సౌలభ్యం, శుభ్రత, మురుగునీటి నిర్వహణ వంటి అంశాల్లో మెరుగుదల రావడానికి ఈ పనులు ఎంతో కీలకమని వివరించారు. ఈ రహదారులు పూర్తయితే ప్రజలకు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయి. పారిశుద్ధ్య సమస్యలు తగ్గుతాయి, అని వారు పేర్కొన్నారు. పనులు నాణ్యంగా, పారదర్శకంగా పూర్తయ్యేలా అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే, ప్రతి గ్రామానికి అవసరమైన వసతులు కల్పించడమే నా ప్రధాన లక్ష్యం. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యం. మీరు చూపుతున్న సహకారమే నాకు శక్తి, అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల పార్టీ నాయకులు, సీనియర్ నాయకు, గ్రామ పెద్దలు, అధికారులు, మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేస్తూ, అభివృద్ధి పట్ల తాము ఆనందంగా ఉ న్నామని తెలిపారు.



## సాంకేతిక విప్లవానికి నాంది రాజీవ్ గాంధీ

### క్యాంప్ కార్యాలయంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

మెదక్ జిల్లా ప్రతినిధి సాక్ష్యం న్యూస్ 21 మే:
దేశానికి సాంకేతికతను తీసుకుని వచ్చి ప్రపంచంలో టెక్నాలజీ విప్లవంలో భారత్ ను నిలిపింది రాజీవ్ గాంధీనేనని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. బుధవారం మెదక్ పట్టణ



అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి ని పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో పేదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మున్సిపల్ ఛైర్మెన్ చంద్రపాల్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ మేడి మధుసూదన్ రావు, తాజా మాజీ కౌన్సిలర్ లు లక్ష్మీనారాయణ, దుర్గ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్, ఉమర్, శంకర్, నాగిరెడ్డి, శ్రీనివాస్ చౌదరి, గాడి రమేష్, దేవుల, దాయర రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫిజ్ మొల్సాబ్, సలీమ్, మెదక్ జిల్లా మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ పడిగే స్వరూప , సూఫి, ముజాంబిల్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## భారత్ లో సాంకేతిక విప్లవానికి నాంది రాజీవ్ గాంధీ

**మెదక్ జిల్లా ప్రతినిధి సాక్ష్యం న్యూస్ 21 మే:**
దేశానికి సాంకేతికతను తీసుకుని వచ్చి ప్రపంచంలో టెక్నాలజీ విప్లవంలో భారత్ ను నిలిపింది రాజీవ్ గాంధీనేనని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.




రాజీవ్‌గాంధీ వర్ధంతి ని పురస్కరించుకుని చిట్కుల్లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో పేదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు. దేశం కోసం తన ప్రాణాలను అర్పించి దేశ ప్రజల గుండెల్లో చిరకాలంగా నిలిచిన ఘనత మహనీయుడు రాజీవ్ గాంధీ సొంతమన్నారు.

## డిజిటల్ విప్లవ పితామహుడు స్వర్గీయ రాజీవ్ గాంధీ

### రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర రావు

**సూర్యపేట మే21 (సాక్ష్యం న్యూస్ ) :**
భారతదేశాన్ని డిజిటల్ టెక్నాలజీ వైపు మళ్ళించి కంప్యూటర్ టెలికాం రంగాలలో విప్లవాత్మకమైన మార్పు తీసుకుని వచ్చిన భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిరస్మరణీయుడు అని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర రావు అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు అబ్దుల్ రహీం ఆద్వర్యంలో జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో అన్నదానం కార్యక్రమంలోను, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజద్ అలీ ల ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వేరు వేరు గా నిర్వహించిన రాజీవ్ గాంధీ వర్ధంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ తాను ప్రధానమంత్రిని కావాలనీ ఎన్నడూ అనుకోలేదన్నారు. రాజకీయాలపై ఆసక్తి లేదని తనకు అత్యంత ఇష్టమైన విమానం పైలట్‌గా ట్రైనింగ్ తీసుకుని ఇండియన్ ఎయిర్ లైన్స్ , ఎయిర్ ఇండియా లాంటి సంస్థలకు సంబంధించిన విమానాల్లో పైలట్ గా విధులు నిర్వహించారని అన్నారు. రాజీవ్ గాంధీ తన తల్లి ఇందిరా గాంధీ 1984లో హత్య చేయబడిన తరువాత దేశ ప్రజలందరూ శోకసంద్రంలో మునిగి ఉన్న అత్యవసర సమయంలో దేశాన్ని సరియైన దిశలో నడపడం కోసం దేశప్రజలందరి కోరిక మేరకు అత్యంత చిన్న వయసులో రాజీవ్ గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు.
ప్రధానమంత్రిగా భారతదేశ ఆధునికీకరణ వైపు దృష్టి సారించి కంప్యూటర్ , టెలికాం రంగాలలో విప్లవాత్మక మార్పులు చేసి డిజిటల్ విప్లవాన్ని సృష్టించి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. అంతే కాకుండా స్థానిక సంస్థలకు అధికారం ఇచ్చి నిధులను నేరుగా గ్రామ పంచాయితీల కే బదిలీ చేసి గ్రామ స్వరాజ్యాన్ని అందించి, స్థానిక సంస్థలను బలోపేతం చేసిన ఘనత రాజీవ్ గాంధీ కే దక్కుతుంది అని అన్నారు.
యువత బాధ్యతాయుతంగా మెలగాలని, కొత్త యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే సదుద్దేశంతో 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన ఘనత స్వర్గీయ రాజీవ్ గాంధీ కే చెందుతుంది అని చకిలం అన్నారు. దురదృష్టవశాత్తు 1991 లో తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్ లో లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం(ఎల్ టీటీఈ) తీవ్రవాదులు జరిపిన ఆత్మాహుతి మానవ బాంబు దాడిలో రాజీవ్ గాంధీ హత్యకు గురవడం దేశాన్ని శోక సముద్రంలో ముంచేసింది అని ఆయన అన్నారు. రాజీవ్ గాంధీ నిస్వార్థంగా ఈ దేశానికి చేసిన సేవలకు గాను భారతరత్న అవార్డు ప్రదానం చేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, రాజీవ్ గాంధీ చూపిన బాటలో నడుస్తూ, ఆయన ఆశయం సాధనకోసం ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా ఐక్యంగా పని చేసి ఈ దేశానికి రాహూల్ గాంధీ ని ప్రధాని చేయాలని, అపుడే రాజీవ్ గాంధీ కి నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, తాజా మాజీ వార్డు సభ్యులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్.ఎస్.యు.ఐ, సేవాదళ్, వాణిజ్య సెల్, ఐ.ఎన్.టియు.సి తదితర అనుబంధం సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కృషి చేస్తాం

### 34వ వర్ధంతిని జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కోదాడ మే 21 (సాక్ష్యం)**
రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కృషి చేయాలని అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్క్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 34వ వర్ధంతి వేడుకలను అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో జరుపుకున్నారు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... భారతదేశ మాజీ



ప్రధాని ఆధునిక భారతదేశ నిర్మాణానికి బాటలు వేసిన మార్గదర్శి గా పేరు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కొండపల్లి వాసు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర సుధారాణి పుల్లారెడ్డి, మాజీ ఎంపీపి చుండూరు వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు సాదే కోటేశ్వరరావు, బోడపూడి సత్యనారాయణ, చిలకమూడి శ్రీనివాసరావు, రామినేని అప్పారావు, మీసాల లక్ష్మీనారాయణ, మేకల శీను, రామినేని శీను, కీత లక్ష్మీనారాయణ, రామినేని సైదమ్మ, చిత్తలూరి వీరబాబు, గోపతి నరసయ్య, బత్తిని రాజయ్య, మీసాల రాజేష్, కొండమడుగుల నరేష్ దుద్దేల నరేష్ ఇరుగు మధు సాదే సతీష్ రవీందర్ పున్నవేల్లి సీతయ్య బత్తుల శ్రీను ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

**కోదాడ మే 21 (సాక్ష్యం)**
కోదాడ మండల పరిధిలోని గుడిబండ, తొగర్రాయి గ్రామాల్లో రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా





నిర్వహించారు. అనంతరం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ...రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగా ఉండి అత్యంత సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో , , అమరనేని వెంకటేశ్వర్లు, కోదాడ పిఎసిఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి,నర్సిరెడ్డి చింత సత్యనారాయణ రెడ్డి,హసన్ అలీ ,నరసింహారావు,రామారావు ఏడుకొండలు, పుల్లయ్య గ్రామ శాఖ అధ్యక్షుడు రఫీ రామారావు ఏడుకొండలు పుల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**జనగామ జిల్లా బ్యూరో. సాక్ష్యం న్యూస్:**
కొడకండ్ల మండలం నిలిబండ తండా, మరియు కొడకండ్ల గ్రామాలలో నిర్వహించబడిన వివాహ రిసెప్షన్ కార్యక్రమాలకి బుధవారం రోజున హాజరైన పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి





నూతన వధూవరులు సురేష్, శ్రీదేవి, మరియు రాములు, ప్రియాంక, దంపతులను ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, నియోజకవర్గ యువజన నాయకులు, గ్రామ నాయకులు, మహిళ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## తార్నాకలో హనుమాన్ జయంతి ఉత్సవాలు

సికింద్రాబాద్, సాక్ష్యం, మే 21:
బీజేపీ నాయకుడు బండ శివారెడ్డి ఆధ్వర్యంలో గురువారం తార్నాక చౌరస్తాలోని గణపతి దేవాలయం ఆవరణలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి తదితరులు హాజరౌతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు అభయాంజనేయ స్వామికి సహస్రనామ ఆకు పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు మహా అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు. కావున ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ కృపకు పాత్రులు కాగలరని విజ్ఞప్తి చేశారు.

## హనుమాన్ చాలీసా శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ :
ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో గల శ్రీ అభయాంజనేయ ఆలయంలో ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న హనుమాన్ చాలీసా శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షులు పుప్పాల శివరాజ్ కోరారు.గత కొంతకాలంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం జరుగుతుందని, ఈనెల 24 తేదీ నా శత జయంతి పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రముఖ వేద పండితులు నంబి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నందిపేట్ కేదార ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహారాజ్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. 24వ తేదీ శనివారం సాయంత్రం 6:30 గంటలకు 101 మంగళహారతులతో స్వామివారికి హారతి కార్యక్రమం ఏర్పాటు చేసినందున మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాజేందర్ గౌడ్, ఔసలి పృథ్వీరాజ్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని పండుగ చేసిన నేత కేసీఆర్

- **కాంగ్రెస్ కుట్రలను తెలంగాణ సమాజం నమ్మదు**
- **ప్రజల దృష్టిని మళ్లించేందుకే కుట్ర**
- **విచారణ పేరుతో నోటీసులా సిగ్గుచేటు**
- **ఇదంతా కక్షసాధింపు చర్యల్లో భాగమే**
- **తెలంగాణ మరోసారి మర్లబడతది**
- **కాంగ్రెస్ ప్రభుత్వం పై జనగామ ఎమ్మెల్యే పల్లా ఫైర్**

జనగామ జిల్లా బ్యూరో. సాక్ష్యం న్యూస్:
మట్టి మనుషుల కష్టాలను తెలుసుకునే నాయకుడు కేసిఆర్ గారు..కాబట్టే వ్యవసాయాన్ని పండుగ చేసి..రైతుకు కుడిభుజంగా నిలిచాడు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఆ మహానేతను లక్ష్యంగా చేసుకొని విచారణ పేరుతో ప్రస్తుత సర్కారు ఇబ్బంది పెట్టాలని చూస్తే తెలంగాణ మరోసారి మర్లబడడం ఖాయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కాళేశ్వరం కమిషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పై కుట్రలకు తెరలేపిందని, సర్కారు చేతకాని తనాన్ని, పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. పదేళ్లలో కేసీఆర్ తెలం గాణను అన్ని రంగాల్లో ముందుంచారని, రాష్ట్ర కీర్తిని విశ్వవ్యాప్తం చేశా రన్నారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణను కేసీఆర్ సస్య శ్యామలం చేశారని, రైతుల సాగునీటి గోస తీర్చేందుకు భగీరథుడిలా కంకణం కట్టుకున్నారన్నారు. తద్వారా తెలంగాణను ధాన్యాగారంగా మారిందని, దీనిని దేశంతోపాటు మిగతా దేశాలు మెచ్చుకున్నాయ న్నారు. కేసీఆర్ గుర్తులు చెరపాలనుకుంటే ఇంకా ఎదుగుతారనే విషయాన్ని మరువొద్దన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు కేసీఆర్ పాలననే గుర్తు చేసుకుంటున్నారని, రాష్ట్రానికి ఎవరు వచ్చినా ఇక్కడి కట్ట డాలను, జరిగిన అభివృద్ధికి,



ఇందుకు కారణమైన కేసీఆర్ ను అందరూ గుర్తు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చేందుకు, కేసీఆర్ కు ఉన్న ఇమేజ్ ను ఓర్వలేకనే సీఎం రేవంత్ రెడ్డి విచారణ పేరుతో ఆయనకు నోటీసులు ఇస్తున్నారన్నారు. ఇంత చేసినందుకా కేసీఆర్ కు నోటీసులు అని, ముమ్మాటికీ కాంగ్రెస్ కక్ష సాధింపు నోటీసులుగానే పరిగణిస్తామన్నారు. ప్రజలు అన్నివేళలూ కేసీఆర్ గారితోనే ఉన్నారు. ఆయనను అడ్డుకోవాలన్న ప్రతి ప్రయత్నం చివరికి ప్రజలే తిప్పికొడతారని హెచ్చరించారు.

## తిరంగ యాత్ర జయప్రదం చేయండి

### కార్గిల్ సొసైటీ చైర్మన్ గాదె రాంబాబు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మే 21 (సాక్ష్యం న్యూస్):
ఆపరేషన్ సింధూర్ సక్సెస్ అయిన సందర్భంగా బిజెపి చేపట్టిన తిరంగ యాత్ర ఈనెల 23న మరిపెడ పట్టణ కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్గిల్ సొసైటీ చైర్మన్ గాదె రాంబాబు



ప్రభుత్వ అతిథి గృహంలో మీడియా సమావేశంలో తెలిపారు.అనంతరం మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ లో భారత్ సైన్యం పాకిస్తాన్,పాక్ అక్రమిత కాశ్మీర్లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన విషయం మనకు తెలిసిందేనని అన్నారు. పాకిస్తాన్ లో టెర్రరిజాన్ని పూర్తిగా అంతం చేస్తేనే భారత్ వాణిజ్య కార్యక్రమాలను పాక్ తో కొనసాగుతుందని దేశ ప్రధాని నరేంద్ర మోడీ,కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పారని కార్గిల్ సొసైటీ చైర్మన్ గాదె రాంబాబు అన్నారు.ఈ యాత్రలో అధికారులు,సైనిక అధికారులు,రక్షణ సిబ్బంది,కళాకారులు,బిజెపి నాయకులు,ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నట్లు వారు వెల్లడించారు. జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.దేశభక్తి నినాదాలు సైన్యానికి మద్దతుగా కార్యక్రమాలు జరుపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మేధావులు, విద్యావంతులు, రాజకీయ నాయకులు, భారీ ఎత్తున ప్రజలు పాల్గొనాలని గాదె రాంబాబు కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గంగాధర్,బిజెపి నాయకురాలు గాదె ఉష రెడ్డి,బిజెపి నాయకులు జగన్ నాయక్ పాల్గొన్నారు.

## హబ్సిగూడ సీట్ నెంబర్ 8 లో గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యం

సికింద్రాబాద్, సాక్ష్యం మే 21
ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్ట్రీట్ నెంబర్ 8 లో గల భవాని మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి వయస్సు సుమారు (70), పడి ఉన్నాడనే సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే అతనిని గాంధీ ఆసుపత్రి కి తరలించగా అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్సై భార్గవి విజ్ఞప్తి చేశారు.



## సాయి నాథునికి మొదటి వస్త్రాల బహూకరణ

### జూన్ 3 నుంచి ఘనంగాప్రతిష్ట మహొత్సవాలు

సాక్ష్యం న్యూస్ ,శివంపేట.
శివంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలో గల శ్రీ గురుపీఠంలో జూన్ 5వ తేదీన జరిగే శ్రీ షిరిడి సాయిబాబా ప్రాణప్రతిష్ట పూజా కార్యక్రమం సందర్భములో శ్రీ షిరిడి





సాయి తత్వ బోధకులు మైనంపాటి ప్రసాద్ శ్రీ సాయినాధునికి మొట్ట మొదటి రోజు అలంకరించే వస్త్రాలను గురు పీఠం ట్రస్టు చైర్మన్ జిన్నారం పెద్దగోని శివ కుమార్ గౌడ్, సభ్యులు మరేళ్ళ మోహన్ రావు లకు బహూకరించారు.దత్త స్వరూపులైన షిరిడి సాయినాధుని కరుణాకటాక్షాలు మైనంపాటి ప్రసాద్ పైన, ఆయన కుటుంబంపై సదా వర్షించాలని కోరుకుంటున్నట్లు ట్రస్టు చైర్మన్ శివ కుమార్ గౌడ్, మరియు ట్రస్టు సభ్యులు తెలిపారు.

## తార్నాకలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**సికింద్రాబాద్, సాక్ష్యం, మే 21:**
బిజెపి నాయకులు బండ శివారెడ్డి ఆధ్వర్యంలో గురువారం తార్నాక చౌరస్తాలోని గణపతి దేవాలయం ఆవరణలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి తదితరులు హాజరైతునట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు అభయాంజనేయ స్వామికి



సహస్రనామ ఆకు పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు మహా అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు. కావున ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ కృపకు పాత్రులు కాగలరని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

### రాష్ట్ర పరిశీలకులు కుమార స్వామి

**ఖానాపురం మే21 ( సాక్ష్యం న్యూస్ ) :**
ఉపాధ్యాయులు శిక్షణ ద్వారా నేర్చుకున్న మెళకువలతొ విద్యార్థులకు నాణ్యమైన, సులభమైన బోధన అందించేందుకు అవకాశం ఉంటుందని శిక్షణ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ బొమ్మెర కుమారస్వామి అన్నారు. బుధవారం మండలం లోని మోడల్ పాఠశాలలో




నిర్వహిస్తున్న 5 రోజుల శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. మండల విద్యాశాఖ అధికారి , కోర్స్ డైరెక్టర్ శ్రీదేవితో కలిసి శిక్షణ నిర్వహణా వివరాలను తెలుసుకున్నారు .ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణ లో నేర్చుకున్న మెలకువలను తరగతి గదిలో వినయోగించాలన్నారు. మండల స్థాయి ప్రాథమిక ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ 5 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ శిక్షణలో 59 మంది ఉపాధ్యాయులు, 8 మంది మండల రిసోర్స్ పర్సన్స్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్పీలు వాగ్యా, కిరణ్, భిక్షపతి, శ్రీనివాస్, చంద్రమౌళి, సారయ్య, కరుణాకర్,భద్రు లతో పాటు ఉపాధ్యాయులు , ఎం ఆర్ సి సిబ్బంది శశిధర్ , రాజేందర్,రమేష్, భాస్కర్, శ్రీను , మహేందర్ , రజని తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధువరులను అక్షింతలతో ఆశీర్వదించినబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ

**జనగామ జిల్లా బ్యూరో. సాక్ష్యం న్యూస్:**
జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామ వాస్తవ్యులు మంద



లింగమ్మ - మల్లయ్య మాజీ వార్డు సభ్యులు గార్ల కుమార్తె సంధ్య రాణి - నరేష్ యాదవ్ గార్ల వివాహం ఏ ఎస్ ఆర్ గార్డెన్స్ రఘునాథపల్లి మండలం లో బుధవారం రోజున జరగగా వివాహానికి హాజరై నూతన వధువరులను అక్షింతలతో ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్య నారాయణ. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసు హరీష్ గౌడ్, పాలకుర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కో - కో ఆర్డినేటర్ కొండ శ్రీను,సీనియర్ నాయకులు మాదరాజు యాకయ్య,సోషల్ మీడియా కో ఆర్డినేటర్ లు సుగురు అనిల్,ఉడుత నరేష్,యువజన నాయకులు లక్కం ఇస్తారీ,పెంతల అనిల్ కుమార్,పెంతల కృపాకర్ రెడ్డి,మంద పెద్దులు,జున్ను సోమనాధం, చీనూరి వినయ్,మాచర్ల చింటూ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు రిజర్వాయర్‌ను పరిశీలించిన పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి

**జనగాం జిల్లా బ్యూరో. సాక్ష్యం న్యూస్:**
పాలకుర్తి మండలంలోని చెన్నూరు గ్రామంలో ఉన్న ప్రధాన నీటి వనరుల్లో ఒకటైన చెన్నూరు రిజర్వాయర్‌ను పాలకుర్తి శాసన





సభ్యురాలు యశస్విని రెడ్డి బుధవారం రోజున పరిశీలించారు. రిజర్వాయర్ యొక్క నీటి నిల్వ స్థితి, ప్రస్తుత పరిస్థితులు, సాగునీటి సరఫరా సామర్థ్యం మరియు భవిష్యత్తు అవసరాలను గురించి వారు సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ. రైతులకు సాగునీటి కొరత లేకుండా చూసే క్రమంలో రిజర్వాయర్ కీలక పాత్ర పోషిస్తోంది. అందువల్ల దీని నిర్వహణ, శుభ్రత, గట్టి నిర్మాణం తదితర అంశాలను కచ్చితంగా పరిశీలించి, అవసరమైన అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం దృష్టి సారించనుంది తెలిపారు. ఎమ్మెల్యే గారి వెంట మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, రైతులు, తదితరులు, ఉన్నారు.

## స్కీమ్‌ల పేరుతో స్కామ్‌లు చేశారు

### జగన్ ప్రభుత్వం నిర్వాకంపై అనగాని విమర్శలు

బాపట్ల,మే21(సాక్ష్యం): గత జగన్ ప్రభుత్వంలో అప్పులు తెచ్చి వివిధ స్కీమ్‌ల పేరుతో స్కామ్‌లు చేసి వారి జేబులు నింపుకున్నారని ఏపీ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. రెవెన్యూ శాఖలో భారీగా అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. అటవీ, పేదల భూములను దోచుకున్నారని.. వీరందరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అన్నిరకాల దోపిడీ జరిగిందని అన్నారు. మరోసారి అక్రమాలకు పాల్పడేందుకు అవకాశం లేకుండా వ్యవస్థలన్నీ ప్రక్షాళన చేస్తున్నామని ఉద్ఘాటించారు. కూటమి ప్రభుత్వానికి ఆర్థికంగా కష్టాలు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట మేరకు మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. పర్టీ కార్యకర్తలు కూడా సంతోషంగా ఉండేలా కచ్చితంగా చూసుకుంటామని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. పార్టీ కార్యకర్తలంతా కష్టకాలంలో పార్టీకి రక్షణకవచంలా నిలిచారని అన్నారు. పార్టీ కార్యకర్తల మనస్సుల్లో ఎప్పుడూ తనకు స్థానం ఉ ండాలనేది తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. కార్యకర్తలే తన కుటుంబ సభ్యులని.. వారి తర్వాతే తనకు ఎవరైనా అని ఉద్ఘాటించారు. కార్యకర్తలను మించి తనకెవ్వరూ ఆత్మీయులు లేరని చెప్పారు. కూటమిలో ఉన్న పార్టీల్లోని కార్యకర్తలకూ ఏదోక సమయంలో తప్పకుండా అవకాశం వస్తుందని, ప్రతి ఒక్కరినీ బాగా చూసుకునే బాధ్యత తమదని మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చారు. ముందు రేపల్లె ప్రాంత అభివృద్ధి ముఖ్యమని.. ఆ తర్వాత పార్టీ కార్యకర్తల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేపల్లె నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మార్చాలని కోరారు. కుప్పం, మంగళగిరి, పిఠాపురం నియోజకవర్గాల మాదిరిగా తన నియోజకవర్గం గురించి కూడా అందరూ మాట్లాడుకోవాలని ఆకాక్షించారు. కార్యకర్తల కోసం టీడీపీ పని చేస్తుందని అన్నారు. పల్నాడులో వైసీపీ గూండాల చేతిలో హత్యకు గురైన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చామని గుర్తుచేశారు. మన గ్రామాన్ని, మన నియోజకవర్గాన్ని అద్భుతమైన అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ కలసి పనిచేద్దామని మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు.

## రెండ్రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

### ఈదురు గాలులతో కూడా వానలు పడే ఛాన్స్
### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన వాతావరణశాఖ

విశాఖపట్టణం/హైదరాబాద్,మే21(సాక్ష్యం): తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కోస్తా పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ద్రోణి మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, 36 గంటల్లో అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉ ందని అంటున్నారు. రెండ్రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మరో ఐదు రోజుల పాటు కూడా ఈదురుగాలులతో కూడా వర్షాలు పడనున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో పలు జిల్లాలో వర్షం పడే అవకాశం ఉందంటున్నారు. పశ్చిమ, తూర్పు జిలాలకు భారీ వర్షాలు పడతాయని తెలిపారు. అటు తెలంగాణలోనూ పలు రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 15 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, నిజామాబాదు, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ, గద్వాల్, నగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌బాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారీ వర్షాలు కురవనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర కర్నాటక-గోవా తీరాల వెంబడి తూర్పు మధ్య అరేబియా సముద్రంపైనున్న ఉపరితల ఆవర్తం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల విస్తరించి ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఈ క్రమంలో నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉ రుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.



గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలుపడుతాయని తెలిపింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. అలాగే, శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వానలు పడుతాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది

## రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోంది

### రేషన్ డోర్ డెలిరీ ఆపేయడమేమిటి
### ఎంపి మిథున్ రెడ్డి ఆగ్రహం

అనంతపురం,మే21(సాక్ష్యం): రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని,. భయపెట్టి పాలన చేయాలనుకోవడం మూర్ఖత్వం అని వైకాపా సీనియర్ నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రె అన్నారు.. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేయడం సరికాదని హితవుచెప్పారు.. ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్‌ల సమావేశంలో పాల్గొన్న మిథున్‌రెడ్డి.. ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో మద్యం కుంభకోణం జరగలేదని స్పష్టం చేశారు.. కట్టుకథలతో మద్యం కుంభకోణం జరిగిందని టీడీపీ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు.. ఇక, వైఎస్ జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు ఆపడం దారుణమైన విషయం అన్నారు.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయకుండా.. ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి విదేశీ నిధులు ఆపడం దుర్మార్గం అన్ని ÷ర్ అయ్యారు.. హంద్రీనీవా లైనింగ్ పనులపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి.. ఏపీ ప్రభుత్వంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. మంగళవారం రోజు సంచలన వ్యాఖ్యలుచేసిన విషయం విదితమే.. ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూనే అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.. ఇప్పుడు ఉన్న అధికారులు అన్యాయమైన పనులు చేస్తే.. రేపు మళ్లీ మన రోజు వస్తుంది.. ఇప్పుడు పేర్లు రాసిపెట్టుకొంది.. రిటైర్డ్ అయినా.. విదేశాలకు పారిపోయినా.. తీసుకొచ్చిన సినిమా చూపిస్తామంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే..

# ఎపికి ఆరు కుంకీ ఏనుగుల అప్పగింత

### డిప్యూటి సిఎం పవన్ సమక్షంలో అప్పగింత కార్యక్రమం
### పంటపొలాలను,.రైతులను కాపాడడమే లక్ష్యమన్న పవన్

బెంగళూరు,మే21(సాక్ష్యం): కర్నాటక నుంచి కుంకీ ఏనుగులు వచ్చాయి. ఏపీకి ఆరు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించింది. బెంగళూరులోని విధానసౌధలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కుంకీ ఏనుగుల అప్పగింత, వాటి సంరక్షణకు సంబంధించిన డాక్యుమెంట్లను పవన్‌కు సిద్ధరామయ్య అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కుంకీ ఏనుగులు ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి, సీఎం సిద్ధరామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి సాయం అడిగినా కర్ణాటక ప్రభుత్వం ముందుకొస్తోందన్నారు. ఏపీ, కర్ణాటక మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని పవన్ ఆకాంక్షించారు. కుంకీ ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీ, కర్ణాటక మధ్య 9 ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. పంటపొలాల్ని నాశనం చేస్తున్న అడవి ఏనుగులను నియంత్రించేందుకు కుంకీ ఏనుగులను రంగంలోకి దించుతారు. కుంకీలు పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఏనుగులు. ఎక్కడైనా ఏనుగుల గుంపు దాడికి దిగినప్పుడు కుంకీలను రంగంలోకి దింపుతారు. ఏనుగులను తరిమికొట్టడంలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. కొన్నిసార్లు గాయపడిన లేదా చిక్కుకున్న అడవి ఏనుగును రక్షించడానికీ వీటిని ఉ పయోగిస్తారు. సాధారణంగా కుంకీ ఏనుగులుగా మగవాటినే ఎంపిక చేసుకుంటారు. ఎందుకంటే ఇవి మాత్రమే ఒంటరిగా సంచరిస్తుంటాయి. వీటిని బంధించి కొన్ని నెలల పాటు శిక్షణ ఇస్తారు. తర్వాత ఆపరేషన్ల కోసం వాడుతుంటారు. ఏనుగుల గుంపును అడవిలోకి తిరిగి పంపించేంత వరకు ఇవి విశ్రమించవు. కొన్నిసార్లు పంట పొలాలపైకి వచ్చిన ఏనుగులతో ఇవి తలపడాల్సి ఉంటుంది కూడా. అందుకే పోరాడడంలోనూ వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.ఏజెన్సీ ఏరియాల్లో ఏనుగుల వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు శ్రీకాకుళం, సాలూరు ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉ ందన్నారు. అటవీ భూమిని ఆక్రమించడం వల్ల ఏనుగులే జనవాసాల్లోకి వస్తున్నాయో లేక ఏం జరుగుతుందో తెలియడం లేదన్నారు. కానీ ఈ తరహా సమస్యను కర్ణాటక ప్రభుత్వం చాలా పకడ్బందీ ప్రణాళికతో నిరోధిస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఈ ప్రభుత్వం చాలా ఏనుగులకు శిక్షణ ఇచ్చిందన్నారు. అంతేకాకుండా అవి ఎలా వ్యవహరించాలో కూడా శిక్షణ ఇచ్చారని చెప్పారు. ఇక ఏనుగులు జనావాసా ప్రాంతంలోకి రాకుండా.. వాటికి ప్రత్యేక మార్గం ద్వారా వెళ్లేలా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉ ందన్నారు. తద్వారా ఆ ప్రాంతంలోని రైతుల భద్రతతో పాటు సురక్షిత చర్యలు తీసుకున్నట్లు అవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాలోని పలు ఏజెన్సీ ప్రాంతాల్లో ఏనుగులు ఊళ్లలోకి దూసుకు వచ్చి.. పంట పొలాలను నాశనం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ దాడుల కారణంగా పలువురు మృత్యువాత పడుతున్నారు. ఏ సమయంలో ఎటువైపు నుంచి ఏనుగులు దాడి చేస్తాయో తెలియన ఓ విధమైన భయాందోళన పరిస్థితి ఆ ప్రాంత ప్రజల్లో నెలకొంది. అంతేకాకుండా.. ఈ ఏనుగుల దాడి కారణంగా.. పలు గ్రామాల ప్రజలు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు.



# విశాఖలో యోగా ఇంటర్నేషనల్ డే

### యోగా మన వారసత్వ ప్రక్రియ
### అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఘనత మోడీదే
### సిఎం చంద్రబాబు వెల్లడి

అమరావతి,మే21(సాక్ష్యం): యోగా ఇంటర్నేషనల్ డేను ఆంధ్రప్రదేశ్‌లో ఘనంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖ కేంద్రంగా జూన్ 21న నిర్వహించే కార్యక్రమంలో ప్రధాని మోడీ హాజరవుతారని అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. నాగరికతకు భారతదేశం పెట్టింది పేరన్నారు. యోగా మన వారసత్వమని.. యోగా ఇంటర్నేషనల్ డేగా గుర్తింపు రావడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కారణమన్నారు. యోగా మెరుగైన జీవనానికి దోహద పడుతుందని తెలిపారు. నేడు ప్రపంచంలో అన్ని దేశాల్లో జరుపుకునే కార్యక్రమం యోగా అని చెప్పుకొచ్చారు. యోగా అనేది కొద్దిమందికో లేక.. కొన్ని ప్రాంతాలకో సంబంధించింది కాదన్నారు. అందరి జీవితాల్లో యోగా అనేది ఒక భాగం కావాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరం యోగా అని చెప్పుకొచ్చారు. ఫొటోలు, ఈవెంట్ కోసం ఒక రోజు చేసే కార్యక్రమం కాదన్నారు. ప్రతి ఒక్కరిలో ప్రగాఢమైన మార్పు తీసుకొచ్చే కార్యక్రమం యోగా అని తెలిపారు. యోగా దినోత్సవాన్ని ప్రధాని మోదీ ఒక దీక్ష , పట్టుదలతో చేస్తున్నారన్నారు. నేటి (బుధవారం) నుంచి నెల రోజుల పాటు యోగాంధ్ర -2025పేరుతో ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొనేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. 5 లక్షల మందితో వచ్చే నెల 21 తేదీన యోగా డే నిర్వహిస్తామని.. ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో యోగ డే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 10 లక్షల మందికి యోగా సర్టిఫికెట్ ఇస్తామన్నారు. యోగా వల్ల తనకు మానసిక ప్రశాంత ఏర్పడిందని ముఖ్యమంత్రి అన్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలు యోగాను ప్రమోట్ చేస్తున్నాయని తెలిపారు. 27 జిల్లాలో నెల రోజులపాటు యోగాంధ్ర పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మీడియా సైతం యోగాను ప్రమోట్ చేసేందుకు కృషి చేయాలని కోరారు. 2,500 మందిని మాస్టర్ ట్రైనర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.కాగా.. విజయవాడ హరిత బెరంపార్కులో యోగాంధ్ర జనజాగృతి కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజులపాటు యోగాంధ్ర ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మంది యోగాలో ప్రవేశించేలా అవగాహన, శిక్షణ ఇవ్వనున్నారు. నిపుణులు రూపొందించిన యోగా కామన్ ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ, అభ్యాసం చేస్తారు. యోగాలో శిక్షణ పొందిన కనీసం 20 లక్షల మందికి సర్టిఫికెట్ల జారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జూన్ 21న విశాఖ ఆర్‌కే బీచ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, వార్డు స్థాయిలో ప్రజలకు యోగా ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని.. ప్రతిఒక్కరూ తమ జీవన మార్గంలో యోగా అభ్యసనాన్ని భాగం చేసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, యోగా ఔత్సాహికులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర

### యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం
### పున్నమిఘాట్‌లో ప్రత్యేకంగా యోగాసనాలు
### ప్రారంభించిన ప్రత్యేక కార్యదర్శి టి. కృష్ణబాబు

విజయవాడ,మే21(సాక్ష్యం): సుసంపన్న, ఆరోగ్య, ఆనందమయ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారం దిశగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార, జనజాగృతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. బుధవారం కృష్ణానదీ తీరాన హరిత బెరం పార్కు-పున్నమిఘాట్‌లో ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఇందులో వివిధ శాఖల అధికారులు, యోగా ఔత్సాహికులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొనగా యోగా ట్రైనర్ రామాంజనేయులు యోగా ప్రయోజనాలతో పాటు పతంజలి యోగ సూత్రాలను వివరించి, యోగాభ్యస నాలు చేయించారు. అనంతరం కృష్ణబాబు మాట్లాడుతూ భారతీయ వారసత్వ, ప్రాచీన సంపదను అందరికీ అందించాలనే ఉద్దేశంతో గౌరవ ప్రధానమంత్రి చొరవ కారణంగా ఐరాస తీర్మానంతో తొలిసారిగా 2015, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి.. ఈ ఏడాది విశాఖలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు గౌరవ ప్రధాని రానున్నట్లు తెలిపారు. యోగా ప్రయోజనాలపై అవగాహన పెంపొందించుకొని, జీవితాంతం ప్రజలు తమ జీవన మార్గంలో యోగాను భాగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు గౌరవ ముఖ్యమంత్రి మార్గనిర్దేశనరతో నెలరోజుల పాటు ఊరూవాడా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దాదాపు రెండు కోట్ల మంది ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. నిపుణులు రూపొందించిన 45 నిమిషాల నిడివితో ఉ న్న కామన్ యోగా ప్రోటోకాల్ ఆధారంగా ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వనున్నామని.. వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నామని కృష్ణబాబు తెలిపారు. శిక్షణ పొందిన వారిద్వారా ప్రతి గ్రామంలో, వార్డులో ప్రజలకు యోగాభ్యసనతో శారీరక, మానసిక ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడంతో పాటు అభ్యసన చేయించడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్‌కు వీలుగా ప్రత్యేక యాప్‌ను రూపొందించడం జరిగిందని, పోర్టల్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో కనీసం నాలుగు పర్యాటక ప్రాంతాల్లో రాష్ట్రం మొత్తంమీద దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. థీమ్ ఆధారిత కార్యక్రమాలతో ప్రతి వర్గానికి యోగాను చేరువచేయడంలో సమష్టి భాగస్వామ్యం అవసరమని.. అందరం కలిసి యోగాంధ్రను విజయవంతం చేద్దామని కృష్ణబాబు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర సాకారం దిశగా యోగాంధ్ర ఓ గొప్ప ముందడుగు అని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. నెల రోజుల యోగాంధ్ర కార్యాచరణలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బాపూ మ్యూజియం, కొండపల్లి ఖిల్లా, గాంధీ హిల్ వంటి చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ప్రతిఒక్కరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం వల్ల మంచి ఫలితాలు ఉ ంటాయని కలెక్టర్ వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా యోగా విశిష్టతను రాష్ట్రం నలుమూలలా వ్యాప్తి చెందేలా యోగాంధ్ర ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుంటే మనం చేసే ప్రతి పని ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. యోగాతో జీవనశైలిని మార్చుకొని ఒత్తిడిని దూరం చేసుకొని ఆనందమయ జీవితాన్ని పొందుదామని పేర్కొన్నారు. నేటి ఆధునిక జీవనశైలిలో ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడం సవాలుగా మారిందని, ఈ నేపథ్యంలో ఒత్తిడిని అధిగమించి, రోజువారీ జీవితంలో వెలుగులు నింపుకునేందుకు ప్రతిఒక్కరూ రోజూ కనీసం అరగంట యోగాభ్యసనాలు, ధ్యానం చేయాలని విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం సూచించారు. యోగాంధ్రలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ప్రత్యేక అవగాహన, యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ÷ార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ శాఖ అధికారి డా. రామత్లేహి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# ప్లేఆఫ్స్‌కు చేరిన ముంబయి

## దిల్లీ క్యాపిటల్స్‌పై భారీ విజయం

ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంగా దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ విజయం సాధించింది. కీలక మ్యాచ్‌లో దిల్లీపై ఆ జట్టు 59 పరుగుల తేడాతో నెగ్గింది. ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. 2025 సీజన్‌లో చివరి ప్లే ఆఫ్స్ చివరి బెర్తును ముంబయి ఇండియన్స్ సొంతం చేసుకుని సత్తా చాటింది. పాయింట్ల పట్టికలో టాప్-4లో చోటు దక్కించుకుంది. ఇప్పటికే గుజరాత్, బెంగళూరు, పంజాబ్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. వాంఖడే వేదికగా మ్యాచ్ జరగ్గా, తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (73లిబీ 43 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. చివర్లో నమన్ ధీర్ (24లిబీ 8 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించాడు. రికెల్‌టన్ (25), విల్ జాక్స్ (21), తిలక్ వర్మ (27) పర్వాలేదనిపించారు. రోహిత్ శర్మ (5), హార్దిక్ పాండ్య (3) నిరాశపరిచారు. దిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 18 ఓవర్లకు 132/5తో ఉన్న ముంబయి 160 కూడా చేయదని అంతా అనుకున్నారు. కానీ చివర్లో సీన్ మారిపోయింది. నమన్ ధీర్ వరుసగా 4, 6, 6, 4తో అదరగొట్టాడు. దిల్లీ బౌలర్లలో ముకేశ్ కుమార్ 2, చమీర, ముస్తాఫిజుర్, కుల్‌దీప్ యదవ్ తలో వికెట్ పడగొట్టారు. 181 పరుగుల లక్ష్యఛేదనలో దిల్లీ 18.2 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌటైంది. సమీర్ రిజ్వీ (39) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. విప్రాజ్ నిగమ్ (20), అశుతోష్ శర్మ (18) పరుగులు సాధించారు. కేఎల్ రాహుల్ (11), డుప్లెసిస్ (6), అభిషేక్ పొరెల్ (6), ట్రిస్టన్ స్టబ్స్ (2) నిరాశపరిచారు. ముంబయి బౌలర్లలో మిచెల్ శాంట్నర్ 3, బుమ్రా 3, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, విల్ జాక్స్, కర్ణ్ చెరో వికెట్ పడగొట్టారు. అలా దిల్లీ ఓటమిపాలై సీజన్‌ను ఎలిమినేట్ అయింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 18.2 ఓవర్లలో 121 పరుగులకు కుప్పకూలింది. సమీర్ రిజ్వీ(35 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 39), విప్రజ్ నిగమ్(11 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 20) టాప్ స్కోరర్లుగా నిలిచారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ముంబై బౌలర్లలో మిచెల్ సాంట్నర్(3/11), జస్‌ప్రీత్ బుమ్రా(3/12) మూడేసి వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించారు. ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, విల్ జాక్స్, కర్ణ్ శర్మ తలో వికెట్ తీసారు.

లక్ష్యచేధనలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు కేఎల్ రాహుల్(11), ఫాఫ్ డుప్లెసిస్(6) తీవ్రంగా నిరాశపరిచారు. అభిషేక్ పోరెల్(6) కూడా ఔటవ్వడంతో పవర్ ప్లేలోనే ఢిల్లీ 3 వికెట్లు కోల్పోయి 49 పరుగులు చేసింది. ఆ వెంటనే నిలకడగా ఆడిన విప్రజ్ నిగమ్‌ను మిచెల్ సాంట్నర్ రిటర్న్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ట్రిస్టన్ స్టబ్స్(2)ను బుమ్రా ఔట్ చేయడంతో ఢిల్లీ 65 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. నిలకడగా ఆడిన సమీర్ రిజ్వీని క్లీన్ బౌల్డ్ చేసిన మిచెల్ సాంట్నర్.. అషుతోష్ శర్మ(18)ను స్టంపౌట్ చేశాడు. దాంతో ఢిల్లీ ఓటమి ఖాయమైంది. మధవ్ తివారి, ముస్తాఫిజుర్ రెహ్మాన్‌లను బుమ్రా పెవిలియన్ చేర్చి ముంబై విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

# 2 ఓవర్లే మా ఓటమిని శాసించాయి: ఫాఫ్ డుప్లెసిస్

ఐపీఎల్ 2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాటం ముగిసింది. ముంబై ఇండియన్స్‌తో బుధవారం జరిగిన డూ ఆర్ డై మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ఢిల్లీ క్యాపిటల్స్ 59 పరుగుల తేడాతో చిత్తయ్యింది. ఈ విజయంతో ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించగా.. ఢిల్లీ క్యాపిటల్స్ అధికారికంగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. 59 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం ఢిల్లీ క్యాపిటల్స్ కొంపముంచింది. ఈ ఘోర ఓటమితో ఢిల్లీ క్యాపిటల్స్ రన్‌రేట్ బాగా తగ్గింది. దాంతో చివరి మ్యాచ్ గెలిచినా.. ముంబైని అధిగమించే పరిస్థితి లేకుండా పోయింది. అయితే ఈ మ్యాచ్‌లో చివరి రెండు ఓవర్లలో 48 పరుగులివ్వడం తమ పతనాన్ని శాసించిందని ఢిల్లీ క్యాపిటల్స్ తాత్కలిక కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ అన్నాడు. అక్షర్ పటేల్ లేకపోవడం కూడా తమ విజయవకాశాలను దెబ్బతీసిందని అభిప్రాయపడ్డాడు. 'మేం బాగానే బౌలింగ్ చేశాం అనిపించింది. ఈ మ్యాచ్‌లో ఓడినా మా కుర్రాళ్లు గొప్ప పోరాట పటిమను చూపించారు. బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. బ్యాటింగ్ చేయడానికి ఇది అంత సులువైన పిచ్ కాదు. చివరి రెండు ఓవర్లలోనే మేము మ్యాచ్‌పై పట్టు కోల్పోయాం. క్రికెట్‌లో మూమెంటమ్ చాలా ముఖ్యం. చివరి రెండు ఓవర్లలో ముంబై బ్యాటర్లు దాదాపు 50 పరుగులు చేశారు. ఇది మా 17-18 ఓవర్ల అద్భుతమైన ఆటను నాశనం చేసింది. ఇక్కడే మేం మూమెంటమ్ కోల్పోయాం. ఈ మ్యాచ్‌లో రెండు జట్లను చూస్తే.. నాకు డేవిడ్, గోలియత్ కథ గుర్తుకొచ్చింది. ఈ పోరును నేను ఆస్వాదించాను. ఎందుకంటే ఇలాంటి పరిస్థితులు జట్టుగా ఆడేందుకు అవకాశం ఇస్తాయి. సమీర్ రిజ్వీ అద్భుతంగా ఆడాడు. అతనిలో ప్రతిభ ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో 17-18 ఓవర్ల వరకు మ్యాచ్ మా చేతుల్లోనే ఉంది. కానీ ఆ తర్వాత చేజారింది. గత 7-8 మ్యాచ్‌ల్లో మేం బ్యాటింగ్, బౌలింగ్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. దాంతోనే ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేదు. ఈ వికెట్‌పై అక్షర్ పటేల్ ఉండి ఉంటే



ఫలితం మరోలా ఉండేది. మిచెల్ శాంట్నర్ బౌలింగ్ చేసిన తీరుతో ఈ విషయం స్పష్టంగా తెలుసొచ్చింది. ఇలాంటి వికెట్‌పై అక్షర్ పటేల్ సత్తా చాటేవాడు. కానీ అతను అనారోగ్యంతో బాధపడుతున్నాడు. స్టార్క్ కూడా అద్భుతమైన బౌలరే. కానీ ఈ వికెట్‌పై స్పిన్నర్లు ప్రభావం చూపుతారు. క్రికెట్‌లో మూమెంటమ్‌ను ఎప్పుడూ లైట్ తీస్కోవద్దు. చివరి రెండు మ్యాచ్‌ల్లో మూమెంటమ్ అందుకోవడానికి మేం బాగా పోరాడం. అగ్రస్థానంలో ఉన్నప్పుడు అస్సలు మూమెంటమ్ కోల్పోకూడదు.'అని ఫాఫ్ డుప్లెసిస్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్(43 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 73 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. నమన్ ధీర్(8 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 24 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో ముఖేష్ కుమార్(2/48) రెండు వికెట్లు తీయగా.. దుష్మంత్ చమీరా, ముస్తాఫిజుర్ రెహ్మాన్, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. చివరి 2 ఓవర్లలో ముంబై 48 పరుగులు చేయడం గమనార్హం. 19వ ఓవర్ వేసిన ముఖేష్ కుమార్ 27 పరుగులిచ్చి ఢిల్లీ క్యాపిటల్స్ కొంపముంచాడు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 18.2 ఓవర్లలో 121 పరుగులకు కుప్పకూలింది. సమీర్ రిజ్వీ(35 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 39), విప్రజ్ నిగమ్(11 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 20) టాప్ స్కోరర్లుగా నిలిచారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ముంబై బౌలర్లలో మిచెల్ సాంట్నర్(3/11), జస్‌ప్రీత్ బుమ్రా(3/12) మూడేసి వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించారు. ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, విల్ జాక్స్, కర్ణ్ శర్మ తలో వికెట్ తీసారు.

## బీసీసీఐ కొత్త నిబంధనలపై ఫ్రాంచైజీల ఆగ్రహం


ఐపీఎల్ 2025 సీజన్ 18 ముగింపు దశలో ఉంది. 2-3 లీగ్ మ్యాచ్‌లు పూర్తయితే ఇక ప్లే ఆఫ్ మ్యాచ్‌లు ఉంటాయి. ఇప్పటికే గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ లెవెన్ మూడు ప్లే ఆఫ్ బెర్త్‌లు ఖాయం చేసుకోగా నాలుగో స్థానం కోసం ఢిల్లీ కేపిటల్స్ వర్సెస్ ముంబై ఇండియన్స్ పోటీ పడుతున్నాయి. ఈ సమయంలో బీసీసీఐ రూల్స్ మార్చడంపై ఫ్రాంచైజీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఐపీఎల్ లీగ్ దశ ముగియనుంది. ప్లే ఆఫ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్న నేపధ్యంలో బీసీసీఐ నిబంధనలు మార్చడంతో ఫ్రాంచైజీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. కేకేఆర్ అయితే బీసీసీఐకు లేఖ కూడా రాసిందని తెలుస్తోంది. ఇండియా పాకిస్తాన్ ఉద్రిక్తత కారణంగా నిలిచిపోయిన ఐపీఎల్ 2025 మళ్లీ ప్రారంభమైంది. ఈ క్రమంలో ప్రతి మ్యాచ్‌కు అదనంగా 120 నిమిషాల సమయం కేటాయిస్తూ బీసీసీఐ కొత్త రూల్ ప్రవేశపెట్టింది. ఈ నిర్ణయం ఫ్రాంచైజీల అభ్యంతరానికి కారణమైంది. ఎందుకంటే వర్షం వంటి పరిస్థితులు తలెత్తితే రెండు గంటలు ఎదురు చూసి 20 ఓవర్ల మ్యాచ్ నిర్వహించాల్సి వస్తుంది. ఐపీఎల్ 2025 తిరిగ ప్రారంభమైన తరువాత మొదటి మ్యాచ్ కేకేఆర్ వర్సెస్ ఆర్సీబీ మధ్య జరిగింది. ఈ మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో రెండు జట్లు



చెరో పాయింట్ దక్కించుకున్నాయి. కేకేఆర్ ప్లే ఆఫ్ అవకాశం కోల్పోయింది. ఈ మ్యాచ్ రద్దయిన తరువాత బీసీసీఐ కొత్త నిబంధన 120 నిమిషాలు తీసుకొచ్చింది. ఆర్సీబీ వర్సెస్ కేకేఆర్ మ్యాచ్‌కు మాత్రం పాత నిబంధన 60 నిమిషాలే అమలు చేశారు. దీంతో తమ మ్యాచ్‌కు ఓ విధంగా, మిగిలిన మ్యాచ్‌లకు మరో విధంగా వ్యవహరించడంపై కేకేఆర్ ఆగ్రహం వ్యక్తం చేసింది. లీగ్ దశ మధ్యలో ఇలా నిబంధనలు మార్చడం పారదర్శకతను దెబ్బతీయడమే కాకుండా అనేక అనుమానాలకు ఆస్కారమిస్తుందని ఇతర ఫ్రాంచైజీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

# మ్యాచ్‌ను మలుపు తిప్పిన సూరీడు!

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్(43 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 73 నాటౌట్) దుమ్మురేపాడు. ప్లే ఆఫ్స్ చేరాలంటే తప్పక గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో సూరీడు మ్యాచ్ విన్నింగ్ పెర్ఫామెన్స్ చేశాడు. యువ బ్యాటర్ నమన్ ధీర్‌తో కలిసి 12 బంతుల్లో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్.. ఢిల్లీ బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ముస్తాఫిజుర్ రెహ్మాన్ వేసిన మూడో ఓవర్‌లోనే రోహిత్ శర్మ(5) ఔటవ్వగా.. విల్ జాక్స్(21)ను ముఖేష్ కుమార్ పెవిలియన్ చేర్చాడు. ర్యాన్ రికెల్టన్(25)ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేయగా.. సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి 55 పరుగులు జోడించిన తిలక్ వర్మను ముఖేష్ కుమార్ పెవిలియన్ చేర్చాడు. హార్దిక్ పాండ్యా(3) కూడా తీవ్రంగా నిరాశపర్చడంతో ముంబై 123 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో నమన్ ధీర్‌తో సాయంతో సూర్యకుమార్ యాదవ్ 36 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 18 ఓవర్లు ముగిసే సమయానికి ముంబై ఇండియన్స్ 132 పరుగులే చేసింది. దాంతో ముంబై 160 పరుగులు చేస్తుందా? అనిపించింది. కానీ ముఖేష్ కుమార్ వేసిన 19వ ఓవర్‌లో సూర్యకుమార్ యాదవ్ ఓ భారీ సిక్సర్ బాదగా.. నమన్ ధీర్ 4, 6, 6, 4 బాది 27 పరుగులు పిండుకున్నాడు. దుష్మంత్ చమీరా వేసిన ఆఖరి ఓవర్‌లో సూర్య రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లు బాది 21 పరుగులు పిండుకున్నాడు. 12 బంతుల్లో సూర్య, నమన్ ధీర్ 6,1,4,6,6,4,4,0,6,6,4,1 వరుసగా బౌండరీలు బాది 48 పరుగులు పిండుకున్నారు. దాంతో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. 160 పరుగులు చేస్తుందా? అని అనుకున్న ముంబై ఇండియన్స్ 180 పరుగులు చేసింది.



## సెంచరీ తర్వాత 500 మిస్డ్ కాల్స్

రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ ఐపీఎల్‌తో క్రికెట్ ప్రపంచం దృష్టిని తన వైపునకు తిప్పుకున్నాడు. ముఖ్యంగా గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఫలితంగా ఐపీఎల్‌లో అత్యంత వేగంగా సెంచరీ బాదిన భారత క్రికెటర్‌గా రికార్డ్ సాధించాడు. అయితే ఈ సెంచరీ తర్వాత తనకు 500 మిస్డ్ కాల్స్ వచ్చినట్లు వైభవ్ తాజాగా చెప్పాడు. ఆ శతకం తర్వాత అనేక మంది తనను సంప్రదిస్తున్నారని అన్నాడు.'గుజరాత్‌పై సెంచరీ సాధించిన తర్వాత నాకు దాదాపు 500 మిస్డ్ కాల్స్ వచ్చాయి. దీంతో నేను 4 రోజులపాటు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసేశాను. ఆ మ్యాచ్ తర్వాత ఎంతోమంది నా దగ్గరకు వస్తున్నారు. కానీ, నా చుట్టూ ఎక్కువ మంది ఉండడం నాకు ఇష్టం ఉండదు. వీలైనంత దూరంగా ఉండడానికే ప్రయత్నిస్తా. కేవలం ఫ్యామిలీ మెంబర్స్, అతి కొద్దిమంది ఫ్రెండ్స్‌తోనే ఉండానికి ఇష్టపడతాను' అని వైభవ్ మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్ అనంతరం కోచ్ ద్రవిడ్‌తో చెప్పాడు.కాగా, ఈ ఏడాది వైభవ్ పలు సంచలనాలు సృష్టించాడు. 14ఏళ్లకే ఐపీఎల్ అరంగేట్రం చేయడం నుంచి 35 బంతుల్లోనే శతకం బాదడం వరకు పలు రికార్డులు తన పేరిట లిఖించుకున్నాడు. ఈ సీజన్‌లో వైభవ్ ఆడింది కొన్ని మ్యాచ్‌లే అయినా, తన సత్తా ఎంటో ప్రపంచానికి పరిచయం చేశాడు. మొత్తం ఏడు మ్యాచ్‌ల్లో వైభవ్ 206.56 స్ట్రైక్ రేట్‌తో 252 పరుగులు చేశాడు. ఇందులో ఒ సెంచరీ, ఓ హాఫ్ సెంచరీ ఉంది.రీసెంట్‌గా చెన్నై మ్యాచ్‌తో రాజస్థాన్ ప్రస్తుత సీజన్‌ను ముగించింది. ఈ క్రమంలో వైభవ్‌పై రాజస్థాన్ కోచ్ రాహుల్ ద్రవిడ్ ప్రశంసలు కురిపించాడు. అలాగే వచ్చే సీజన్‌కు బాగా ప్రిపేర్ అయ్యి రావాలని వైభవ్‌కు సూచించాడు. 'ఈ సీజన్ నీకు అద్భుతమైంది. అయినా నువ్వు ఇంకా బాగా ప్రాక్టీస్ చెయాలి. కానీ వైభవ్ ఒక్కటి గుర్తుపెట్టుకో. వచ్చే సీజన్‌లో బౌలర్లంతా నీ కోసం బాగా ప్రిపేర్ అయ్యి వస్తారు. అందుకే నువ్వు వాళ్లకంటే ఎక్కువ ప్రిపేర్ అయ్యి రావాలి. స్కిల్స్ పెంచుకోవాలని' అని ద్రవిడ్ యంగ్ క్రికెటర్ వైభవ్‌తో చెప్పాడు. కాగా రాజస్థాన్ 14 మ్యాచ్‌ల్లో 4 విజయాలు 9వ స్థానంతో సీజన్‌ను పేలవంగా ముగించింది.





# బ్యాటింగ్ ఆర్డర్ ను మరింతగా పునర్మించాలి

## చెన్నై సూపర్ కింగ్స్ పై ఆకాశ్ చోప్రా

ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఈసారి కూడా ప్లే ఆఫ్ చేరకుండానే తన ప్రస్థానం ముగించింది. నిజానికి 18 ఏళ్ల లీగ్ చరిత్రలో తొలిసారి అట్టడుగు స్థానమైన పదో స్థానంతో సీజన్ ను ముగించబోతోంది. అలాగే ఈసారి అన్నిటికంటే ముందు ప్లే ఆఫ్ రేసు నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా చెత్త రికార్డు మూటగట్టుకుంది. గతేడాది కూడా ఐదో స్థానంలో నిలిచి, ప్లే ఆఫ్ కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఈ క్రమంలో జట్టును ప్రక్షాళన చేయాలని డిమాండ్లు ఊపందుకున్నాయి. చెన్నై చివరి మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడిన తర్వాత కెప్టెన్ ఎంఎస్ ధోనీ కూడా ఇదే మాట మాట్లాడాడు. వచ్చే ఏడాది జట్టును మొత్తంగా నిర్మించాల్సి ఉంటుందని, జీరో నుంచి ప్రారంభించాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. అలాగే వేలంలో కొత్త ఆటగాళ్లను తీసుకోవాల్సి ఉంటుందని తెలిపాడు. తాజాగా ధోనీ మాటలకి మద్ధతుగా మాజీ ప్లేయర్, కామేంటేటర్ ఆకాశ్ చోప్రా తనలోని ఆలోచనలను పంచుకున్నాడు. జట్టులో స్టార్ ఆల్ రౌండర్ గా సుదీర్ఘకాలం సేవలు అందిస్తున్న రవీంద్ర జడేజా ను తర్వాతి సీజన్ కు ట్రేడ్ చేయాలని చోప్రా సూచించాడు. అతని ఇతర జట్లకు ట్రేడ్ చేసి, అతని స్థానంలో వేరే ఆటగాళ్లను తీసుకోవాలని పేర్కొన్నాడు. ఈ సీజన్లో తను అటు బ్యాట్, ఇటు బంతితో తను విఫలమయ్యాడని గుర్తు చేశాడు. అలాగే న్యూజిలాండ్ కు చెందిన బ్యాటింగ్ ద్వయం రచిన్ రవీంద్ర, డేవన్ కాన్వే ను కూడా రిలీజ్ చేసి, కొత్త ఆటగాళ్లను తీసుకోవాలని, అలాగే బ్యాటింగ్ ఆర్డర్ ను మరింతగా పునర్మించాలని పేర్కొన్నాడు. ముఖ్యంగా నాలుగో నెం.లో విదేశీ ప్లేయర్ ను ఆడించాలని పేర్కొన్నాడు. వయసు మళ్లిన ఆటగాళ్లను సాగనంపి, ఆయుష్ మాత్రే, ఊర్విల్ పటేల్, షేక్ రషీద్, డెవాల్డ్ బ్రివిస్ లతో బ్యాటింగ్ ఆర్డర్ ను పటిష్టం చేసుకోవాలని చోప్రా పేర్కొన్నాడు. ఓపెనర్ గా రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కు తోడుగా ఆయుష్ మాత్రే, రషీద్ లను ఉపయోగించాలని, నెం.3లో ఉర్విల్ పటేల్ సరిగ్గా పరిపోతాడని తెలిపాడు. ఆ తర్వాత నాలుగో నెం.లో డెవాల్డ్ బ్రివిస్ సరిగ్గా సరిపోతాడని వెల్లడించాడు. ఇంతకుముందులాగా నెం.3, 4లలో శామ్ కరన్, జడేజాలను ఆడించడం సరికాదని వ్యాఖ్యానించాడు. జట్టుకు కొత్త రక్తాన్ని ఎక్కించాల్సిన అవసరముందని పేర్కొన్నాడు. అలాగే విదేశీ బౌలర్లలో నూర్ అహ్మద్, మతీషా పతిరాణలను రిటైన్ చేసుకోవాలని పేర్కొన్నాడు. మరోవైపు చెన్నై కి మరో మ్యాచ్ ఈ సీజన్ లో మిగిలి ఉండటంతో ధోనీ రిటైర్మెంట్ పై ఏదైనా ప్రకటన వచ్చే అవకాశముందని చాలామంది భావించినా, అదేమీ లేదని, వచ్చే సీజన్ లో కూడా ధోనీ ఆడతాడని సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది.

# ధోనినే డిసైడ్ అవ్వాలి!

## కృష్ణమాచారి శ్రీకాంత్

చెన్నై సూపర్ కింగ్స్ సీనియర్ ప్లేయర్ మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్ రిటైర్మెంట్ పై కొన్నేళ్లుగా చర్చ నడుస్తూనే ఉంది. ఇదే ఆఖరి సీజన్ అంటూ గత రెండేళ్లుగా ధోనీ ఐపీఎల్ కెరీర్‌పై ప్రచారం సాగుతోంది. కానీ, ఆ ప్రచారాలను కొట్టిపారేయడం, మళ్లీ కొత్త సీజన్‌లో ధోనీ బరిలోకి దిగడం మామూలు విషయమైంది. ఈ క్రమంలో ధోనీ ఐపీఎల్ రిటైర్మెంట్ అంశం తాజాగా మరోసారి చర్చనీయాంశమైంది. ఈ సీజన్‌లో చెన్నై ఇప్పటికే 13 మ్యాచ్‌లు ఆడేసింది. ఇక మే 25న గుజరాత్‌తో చివరి మ్యాచ్ ఆడనుంది. ఈ సీజన్‌లో చెన్నైకి ఇది ఆఖరి మ్యాచ్. ఈ నేపథ్యంలోనే పలువురు మాజీ క్రికెటర్లు ధోనీ రిటైర్మెంట్‌పై కామెంట్స్ చేస్తున్నారు. ఐపీఎల్‌లో ఇంకా కొనసాగాలా లేదా వీడ్కోలు పలకాలా అనే దానిపై ధోనీనే నిర్ణయం తీసుకోవాలని కృష్ణమాచారి శ్రీకాంత్ అన్నాడు. తన ఫిట్‌నెస్ ఆధారంగా డిసైడ్ అవ్వాలని అన్నాడు. ఈ వయసులోనూ క్రికెట్ ఆడడం ఏ మాత్రం ఈజీ కాదు. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి ఎంతో కష్టపడాల్సి ఉంటుందని అన్నాడు. ధోనీ రిటైర్మెంట్‌పై టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ జోగిందర్ శర్మ మాట్లాడాడు. ధోనీ విశ్రాంతి తీసుకునే వేళ అయ్యిందని అన్నాడు. ధోనీ ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకుంటే, అతను దాన్ని నిరూపించుకోవడానికి ఆడాల్సి ఉంటుంది. కానీ ధోనీ ఇప్పుడు రెస్ట్ తీసుకోవాల్సిన సమయం వచ్చిందని అనుకుంటున్నాను.తాను ధోనీ అయితే ఇప్పటికే ఐపీఎల్‌కు గుడ్ బై చెప్పేవాడినని సంజయ్ బంగర్ తెలిపాడు. టీమ్‌లో తరచూ మార్పులు జరుగుతూనే ఉంటాయని, అందుకే రిటైర్మెంట్ తీసుకోడానికి ఓ సమయం అంటూ ఉండదని అన్నాడు. ఈ క్రమంలోనే తాను తప్పుకున్నా, ఫ్రాంచైజీ దానికదే ముందుకు వెళ్తుందని గమనించాల్సి ఉంటుందని సంజయ్ పేర్కొన్నాడు. 2023లో చెన్నై టైటిల్ నెగ్గినప్పుడే ధోనీ ఐపీఎల్ నుంచి రిటైర్ అవ్వాల్సిందని మనోజ్ తివారి ఓ సందర్భంలో అన్నాడు. అప్పుడే తప్పుకుంటే గౌరవంగా ఉండేదని మనోజ్ అభిప్రాయపడ్డాడు. మరోవైపు, ధోనీ ఇప్పట్లో రిటైర్మెంట్ ప్రకటించేది లేదని ఇప్పటికే క్లారిటీ ఇచ్చాడు. తనకు వచ్చే సీజన్ వరకు దీని గురించి ఆలోచించుకునే టైమ్ ఉందని అన్నాడు. మరి చూడాలి మే 25న ధోనీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో! కాగా, ఈ సీజన్‌లో ధోనీ ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. కెప్టెన్‌గానూ పెద్దగా ప్రభావం చూపలేదు. అతడి కెప్టెన్సీలో ఈసారి చెన్నై 8 మ్యాచ్‌లు ఆడగా, కేవలం రెండింట్లోనే నెగ్గింది. ఇక బ్యాటింగ్‌లో 13 మ్యాచ్‌ల్లో 135.17 స్ట్రైక్ రేట్‌తో 196 పరుగులే చేశాడు.



# ఘనంగా 'హరి హర వీరమల్లు' మూడవ గీతం 'అసుర హననం' ఆవిష్కరణ కార్యక్రమం

## పవన్ కళ్యాణ్ గారు మూర్తీభవించిన ధర్మాగ్రహం: ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చారిత్రాత్మక యోధుడిగా కనువిందు చేయనున్న ప్రతిష్టాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు'. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న 'హరి హర వీరమల్లు'లో బాబీ డియోల్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, రెండు గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మూడవ గీతంగా 'అసుర హననం' విడుదలైంది. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమాన్ని చిత్ర బృందం ఘనంగా నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఉన్న అభిమానులు, ప్రేక్షకుల కోసం తెలుగు, తమిళ, హిందీ వ్యాఖ్యాతలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం.

'అసుర హననం' గీతం రోమాలు నిక్కబొడుచుకునేలా ఉంది. అసురులపై పోరాడుతున్న యోధుడి యొక్క వీరత్వాన్ని చాటిచెప్పేలా సంగీతం, సాహిత్యం ఉన్నాయి. శ్రోతలలో పోరాట స్ఫూర్తిని రగిల్చేలా కీరవాణి సంగీతం శక్తివంతంగా ఉంది. ఆ సంగీతానికి తగ్గట్టుగా గీత రచయిత రాంబాబు గోశాల.. తన పదునైన సాహిత్యంతో కట్టిపడేశారు. "భరతమాత నుదుటి రాత మార్చు ధీమసం" వంటి పంక్తులతో తన కలం బలం చూపించారు. గాయనీగాయకులు ఐరా ఉడుపి, కాల భైరవ, సాయిచరణ్ భాస్కరుని, లోకేశ్వర్ ఈదర, హైమత్ మహమ్మద్ తమ గాత్రంతో గీతాన్ని మరోస్థాయికి తీసుకెళ్ళారు.
'అసుర హననం' గీతావిష్కరణ కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి మాట్లాడుతూ, "హరి హర వీరమల్లు సినిమాతో నా ప్రయాణం ఐదేళ్ల క్రితం రాధాకృష్ణ(క్రిష్)తో మొదలైంది, ఇప్పుడు జ్యోతికృష్ణతో పూర్తవుతుంది. నేను చాలామంది దర్శకులను చూశాను. కానీ, తక్కువ మందిలో ఉండే అరుదైన క్వాలిటీ జ్యోతిలో ఉంది. వేగంగా నిర్ణయం తీసుకుంటాడు, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటాడు. ఎడిటింగ్, గ్రాఫిక్స్, మ్యూజిక్ అన్ని పనులు ఒక్కడే చూసుకుంటూ నిద్రాహారాలు మాని ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు. ఇండస్ట్రీలో వివాద రహితుడిగా ఎ.ఎం. రత్నం గారికి పేరుంది. లిరిక్ రైటర్ గా ఆయనకు నేను పెద్ద ఫ్యాన్ ని. ఈ సినిమా రూపంలో ఎ.ఎం. రత్నం గారికి



మరో భారీ విజయం సొంతం అవుతుందని విశ్వసిస్తున్నాను. అలాగే నిర్మాత దయాకర్ గారంటే నాకెంతో గౌరవం. ఈ సినిమాలో ఆయన పాత్ర ఎంతో ఉంది. రాంబాబు లాంటి మంచి గీత రచయితను నాకు జ్యోతికృష్ణ పరిచయం చేశారు. నిధి అగర్వాల్ తన పాత్రను చక్కగా పోషించింది. పవన్ కళ్యాణ్ గారిని మీరందరూ పవర్ స్టార్ అంటారు. నేను మూర్తీభవించిన ధర్మాగ్రహం అంటాను. ఆగ్రహం మనందరికీ వస్తుంది. కానీ సమాజం కోసం వచ్చేది ధర్మాగ్రహం. ఆయనకు మాత్రమే సరిపోయేలా 'హరి హర వీరమల్లు'ను తీర్చిదిద్దారు. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకుపోయే కార్చిచ్చు పవన్ కళ్యాణ్ గారు. కార్చిచ్చు మీద ఎంత వాన పడినా అది ఆగదు. ఆయనతో మొదటిసారి చేస్తున్న సినిమా కాబట్టి ఎంతో శ్రద్ధతో చేశాను. జూన్ 12న విడుదలవుతున్న ఈ సినిమాని మీరు ఆదరిస్తారని ఆశిస్తున్నాను." అన్నారు.

చిత్ర దర్శకుడు జ్యోతి కృష్ణ మాట్లాడుతూ, "పవన్ కళ్యాణ్ గారిని డైరెక్ట్ చేయాలని ప్రతి దర్శకుడికి కల ఉంటుంది. అది ఒక అవార్డు గెలుచుకున్నట్టుగా ఉంటుంది. నాకు ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. మొదట ఈ ప్రాజెక్ట్ కి పెద్ద పునాది వేసింది క్రిష్ గారు. దానిని పెద్ద స్థాయికి తీసుకెళ్ళాలని రత్నం గారు ప్లాన్ చేశారు. ఇంత పెద్ద బాధ్యతను ఒలింపిక్ టార్చ్ లాగా క్రిష్ గారు నాకు అందించి ముందుకు తీసుకెళ్ళమని చెప్పారు. పవన్ కళ్యాణ్ గారిని, రత్నం గారిని మెప్పించడం మామూలు విషయం కాదు. అలాంటిది ఆ ఇద్దరూ మెచ్చారంటే.. ఈ సినిమా థియేటర్లలో ఏ స్థాయి స్పందన సొంతం చేసుకోబోతుందో మీరే ఊహించుకోవచ్చు. కీరవాణి గారితో పని చేయడం గర్వంగా ఉంది. కీరవాణి గారు అందరినీ ప్రోత్సహిస్తారు. రాంబాబు గారికి సిట్యుయేషన్ చెప్పి, పాట రాయించుకొని కీరవాణి గారిని కలిస్తే.. సాహిత్యం బాగుందని మెచ్చుకున్నారు. నన్ను కూడా ఎంతో ప్రోత్సహించారు. ఓ వైపు ప్రజాసేవ, మరోవైపు ఇచ్చిన మాట కోసం సినిమాలు చేస్తూ విశ్రాంతి తీసుకోకుండా పవన్ కళ్యాణ్ గారు ఎంతో శ్రమిస్తున్నారు. ఒక గొప్ప సినిమాని ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో నాన్నగారు మొదటి సినిమా నిర్మాతలా ఈ సినిమా కోసం పని చేశారు. కత్తికి, ధర్మానికి మధ్య జరిగే యుద్ధమే ఈ కథ." అన్నారు.

ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం మాట్లాడుతూ, "ముందుగా మీడియా మిత్రులందరికీ నమస్కారం. ఐదు సంవత్సరాలు ఎంతో కష్టపడి ఈ సినిమా తీశాము. మీ మద్దతుతో ఈ సినిమా మరో స్థాయికి వెళ్తుందని నమ్ముతున్నాను. ఇది మొదటి ప్రెస్ మీట్. మరో రెండు భారీ వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాము. ఇంత భారీ సినిమాకి తక్కువ సమయంలో వీలైనంత ఎక్కువ ప్రచారం చేయాల్సి ఉంది. అందుకు మీడియా సహకారం కావాలి. సినిమా ఫీల్డ్ లో నా ప్రయాణం 54 ఏళ్ళు. తెలుగు, తమిళ, హిందీ అన్ని భాషల్లో సినిమాలు తీశాను. 90 శాతానికి పైగా నా సినిమాలు విజయం సాధించాయి. సినిమా ద్వారా వినోదంతో పాటు, ఏదో ఒక సందేశం ఇవ్వాలనేది నా తపన. భారతీయుడు, ఒకే ఒక్కడు లాంటి సినిమాలు అందించాను. హరి హర వీరమల్లు సినిమా తయారవ్వడానికి ముఖ్యకారణం పవన్ కళ్యాణ్ గారు. క్రిష్ గారు చెప్పిన కథ నచ్చి, పవన్ కళ్యాణ్ గారి దగ్గరకు తీసుకెళ్ళాను. రత్నం గారి జడ్జిమెంట్ ను నమ్మి ఈ సినిమా చేస్తున్నానని పవన్ కళ్యాణ్ గారు చెప్పారు. కొన్ని కారణాల వల్ల సినిమా ఆలస్యమైంది. నా కుమారుడు అని చెప్పడం కాదు.. జ్యోతికృష్ణ ఈ సినిమా బాధ్యతను తీసుకొని ఎంతో కష్టపడి పని చేశాడు. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి సినిమాని పూర్తి చేశాడు. హరి హర వీరమల్లు అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా తెలుగుతో పాటు అన్ని భాషల్లో విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను." అన్నారు.

కథానాయిక నిధి అగర్వాల్ మాట్లాడుతూ, "హరి హర వీరమల్లు అనేది నాకు చాలా ఎమోషనల్ జర్నీ. ఇది నాకొక ఎమోషనల్ ఫిల్మ్. ఈ సినిమాకి నా హృదయంలో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది. నేను పవన్ కళ్యాణ్ గారికి వీరాభిమానిని. ఆయనతో కలిసి నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన ఎ. ఎం. రత్నం గారికి కృతజ్ఞతలు. సినిమా కోసం అంతలా కష్టపడే నిర్మాతను నేను చూడలేదు. జ్యోతి కృష్ణ గారు ఈ సినిమా కోసం ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. ఆయన కష్టానికి తగిన ప్రతిఫలం రావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను." అన్నారు.

గీత రచయిత రాంబాబు గోశాల మాట్లాడుతూ, "ఈ సినిమాలో 'అసుర హననం' అనే పాట రాయడం నాకు చాలా చాలా సంతోషంగా ఉంది. భారతీయుడు, జీన్స్, ఖుషి లాంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్లు తీసిన నిర్మాత ఎ. ఎం. రత్నం గారు.. ఎంతో ప్రతిష్టాత్మకంగా పవన్ కళ్యాణ్ గారితో 'హరి హర వీరమల్లు' చేసి జూన్ 12న విడుదల చేయబోతున్నారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన జ్యోతికృష్ణ గారికి ధన్యవాదాలు. నాతో 'రూల్స్ రంజన్' సినిమాలో 'సమ్మోహనుడా' అనే పాట రాయించారు. అది చాలా పెద్ద హిట్ అయింది. దానికి వంద రెట్లు ఈ పాట హిట్ అవుతుందని నేను బలంగా నమ్ముతున్నాను. ఈ సినిమా కోసం జ్యోతికృష్ణ గారు యుద్ధం చేశారు. ఆయన తపస్సు వల్లే ఈ చిత్రం ఇంత త్వరగా పూర్తయింది. ఇక కీరవాణి గారి సంగీతంలో పాట రాయడం అదృష్టంగా భావిస్తున్నాను. పవన్ కళ్యాణ్ గారంటే పోరాటం, పవన్ కళ్యాణ్ గారంటే ప్రకాశం, పవన్ కళ్యాణ్ గారంటే ధైర్యం, పవన్ కళ్యాణ్ గారంటే అన్ లిమిటెడ్ పవర్. దానిని సినిమాకి అన్వయించుకుంటూ పాట రాయమని జ్యోతికృష్ణ గారు చెప్పారు. నాకిచ్చిన బాధ్యతకు నేను న్యాయం చేశానని అనుకుంటున్నాను. ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. " అన్నారు.

నటుడు రఘుబాబు మాట్లాడుతూ, "జూన్ లో పండగలు ఏమీ లేవు. 'హరి హర వీరమల్లు' రూపంలో జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా పెద్ద పండుగ రాబోతుంది. సినిమా అద్భుతంగా వచ్చింది. పవన్ కళ్యాణ్ గారు మొదటిసారి చారిత్రాత్మక చిత్రం చేశారు. న భూతో న భవిష్యతి అనే స్థాయిలో ఈ చిత్రం ఉంటుంది." అన్నారు.

అంగరంగ వైభవంగా జరిగిన ఈ వేడుకలో.. 'అసుర హననం' గీతాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా విడుదల చేశారు. ఈ వేడుకకు తెలుగు మీడియా, జాతీయ మీడియాతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషలకు చెందిన మీడియా కూడా పాల్గొంది. గీతావిష్కరణ కార్యక్రమాన్ని ఇన్ని భాషల మీడియా సమక్షంలో ఇంత వైభవంగా నిర్వహించడం అనేది నిజంగా గొప్ప విషయమని చెప్పాలి.

తారాగణం: పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నరా ఫతేహి
దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ
నిర్మాత: ఎ. దయాకర్ రావు
సమర్పణ: ఎ. ఎం. రత్నం
బ్యానర్: మెగా సూర్య ప్రొడక్షన్స్
సంగీతం: ఎం. ఎం. కీరవాణి
ఛాయాగ్రహణం: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వి.ఎస్
కూర్పు: ప్రవీణ్ కె.ఎల్
సాహిత్యం: సిరివెన్నెల సీతారామ శాస్త్రి, చంద్రబోస్, పెంచల్ దాస్
విజువల్ ఎఫెక్ట్స్: హరి హర సుతాన్, సోజో స్టూడియోస్, యూనిఫై మీడియా, మెటావిక్స్
కళా దర్శకుడు: తోట తరణి
నృత్య దర్శకత్వం: బృందా, గణేష్
స్టంట్స్: శామ్ కౌశల్, టోడర్ లాజారో జుజీ, రామ్ – లక్ష్మణ్, దిలీప్ సుబ్బరాయన్, విజయ్ మాస్టర్
పీఆర్ఓ: లక్ష్మీవేణుగోపాల్

# 'షష్టి పూర్తి' సినిమాకు పని చేయడంతో నాకు యాక్టింగ్ స్కూల్‌కు వెళ్లినట్టు అనిపించింది.. ప్రమోషన్స్‌లో హీరోయిన్ ఆకాంక్ష సింగ్

డా. రాజేంద్ర ప్రసాద్, అర్చన కాంబినేషన్ లో రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ( MAA AAIE ) ప్రొడక్షన్స్ పతాకం పై రూపేష్ నిర్మించిన 'షష్టిపూర్తి' చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన పాటలు, టీజర్, ట్రైలర్ అన్నీ కూడా ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచేశాయి. 'మళ్లీ రావా', 'దేవదాస్', 'పరంపర' ప్రాజెక్ట్‌లతో తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న ఆకాంక్ష సింగ్ ఇప్పుడు 'షష్టి పూర్తి' అంటూ రాబోతోన్నారు.ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా హీరోయిన్ ఆకాంక్ష సింగ్ మీడియాతో ముచ్చటించారు. ఆమె సినిమా గురించి చెప్పిన విశేషాలివే..

★ తెలుగులో నేను చాలా గ్యాప్ తరువాత వస్తున్నాను. కరోనా వల్ల నాకు చాలా గ్యాప్ వచ్చింది. హీరో నాని సోదరి దీప్తి గంటా తెరకెక్కించిన 'మీట్ క్యూట్' చిత్రాన్ని ముందుగా థియేటర్లో రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ చివరకు ఓటీటీలో వచ్చింది. ఇక ఇప్పుడు 'షష్టి పూర్తి' సినిమా థియేటర్లోకి రాబోతోంది. ఈ చిత్రం అద్భుతంగా ఉంటుంది. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఉంటుంది. ఇళయరాజా గారి సంగీతం అందరినీ మెప్పిస్తుంది.

★ 'షష్టి పూర్తి' సినిమాలో జానకి అనే పాత్రలో కనిపిస్తాను. కథను వినేందుకు హైదరాబాద్‌కు వచ్చాను. కథ విన్న వెంటనే, నా పాత్ర గురించి తెలిసిన వెంటనే ఒప్పుకున్నాను. ఇప్పుడు ఇలాంటి కథలు అవసరం. ఓ గ్రామీణ అమ్మాయి పాత్రను పోషించాను. టెంపుల్ ట్రెజరర్‌గా కనిపిస్తాను. అచ్చమైన తెలుగమ్మాయిగా ఈ చిత్రంలో కనిపిస్తాను.

★ ఇంత వరకు నేను అచ్చమైన తెలుగమ్మాయిలా కనిపించే పాత్రను పోషించలేదు. లంగావోణిలు కట్టలేదు. రాజమండ్రిలో నెల రోజులకు పైగా షూటింగ్ చేశాను. గోదావరి ప్రాంతాల్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఎండల్లో అక్కడ ఎంతో కష్టపడి షూటింగ్ చేశాం. పడవల్లో ప్రయాణం చేశాం. అవన్నీ నాకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. గోదావరి అందాల్ని మరింత అందంగా చూపించారు.

★ 'బెంచ్ లైఫ్'లో ఇది వరకు నేను రాజేంద్ర ప్రసాద్ గారితో నటించాను. మళ్లీ ఈ చిత్రంలో నటించాను. ఆయనతో కలిసి పని



చేయడం వల్ల ఎంతో నేర్చుకున్నాను. మేం ఇద్దరం ఎప్పుడు కలిసి నటించినా గ్లిజరిన్ వాడలేదు. సహజంగానే ఎమోషనల్ సీన్స్‌ను రక్తి కట్టించేవాళ్లం. 'షష్టి పూర్తి' కోసం పని చేస్తుంటే నాకు యాక్టింగ్ స్కూల్‌కు వెళ్లినట్టుగా అనిపించింది. ఈ చిత్రంతో ఎంతో నేర్చుకున్నాను.

★ 'షష్టి పూర్తి' అనేది కేవలం షష్టి పూర్తి గురించే ఉండదు. అన్ని రకాల అంశాలు ఉంటాయి. ఇక ఇందులో నేను కేవలం రెగ్యులర్ హీరోయిన్ పాత్రలో కనిపించను. నా కారెక్టర్‌లో ఎన్నో షేడ్స్ ఉంటాయి. అవన్నీ నేను ఇప్పుడే చెప్పలేను. అవన్నీ మీరు సినిమాలోనే చూడాలి.

★ మా నిర్మాత రూపేష్ చాలా మంచి వ్యక్తి. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ఈ చిత్రానికి న్యాయం చేశారు. అందరినీ ఒకతాటిపైకి తీసుకు వచ్చారు. ఇంత గొప్ప చిత్రాన్ని నిర్మించారు. మా దర్శకుడు పవన్‌కు ఓ క్లారిటీ, విజన్ ఉంది. కథ మీద ఆయనకు చాలా పట్టు ఉంది. ఆయనతో పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

★ నన్ను ఓ మంచి నటిగానే జనాలు గుర్తు పెట్టుకోవాలని అనుకున్నాను. అందుకే తగ్గట్టుగానే మంచి పాత్రలను, మంచి కథల్ని ఎంచుకుంటూ వచ్చాను. 'షష్టి పూర్తి'తో నాకు ఇంకా చాలా మంచి పేరు వస్తుందని భావిస్తున్నాను. నాకు కథ, పాత్ర నచ్చితే ఓటీటీలో అయినా, వెబ్ సిరీస్‌లో అయినా సరే నటిస్తాను. మన పని మనం సక్రమంగా చేసుకుంటూ పోతే అవకాశాలు వాటంతటవే వెతుక్కుంటూ వస్తాయి.

★ నాకు అన్ని రకాల పాత్రలను, జానర్లను టచ్ చేయాలని ఉంది. నాకు యాక్షన్ చిత్రాలంటే ఎక్కువగా ఇష్టం. ప్రస్తుతం ఓ యాక్షన్ మూవీని చేస్తున్నాను. అది చాలా బాగా వస్తోంది. తమిళంలో ఇంకో సినిమాను చూస్తాను. నాకు నాని చిత్రాలు అంటే చాలా ఇష్టం. రీసెంట్‌గా 'అమరన్' సినిమాను చూశాను.

★ 'షష్టి పూర్తి' పాటలు, మ్యూజిక్ అందరినీ కదిలిస్తుంది. ప్రతీ పాటకు ఓ ఎమోషన్ ఉంటుంది. ఇళయరాజా గారి పాటలు ఎప్పటికీ నిలిచిపోతాయి. ఈ చిత్రాన్ని కుటుంబ సమేతంగా చూడాలి. అందరూ చూడాల్సిన చిత్రం. తల్లిదండ్రుల గురించి గొప్పగా చెప్పే ఈ సినిమాను అందరూ తప్పకుండా చూసి సక్సెస్ చేయండి. ఈ మూవీ కోసం షూటింగ్ చేస్తున్నప్పుడు నా తండ్రి నాకు గుర్తుకు వచ్చారు. నేను ఆయన్ను చాలా మిస్ అయ్యాను. తల్లిదండ్రులతో ఎక్కువ సమయాన్ని గడపండి.. వారిని ప్రేమించండి. అందరూ 'షష్టి పూర్తి' సినిమాను చూడండి.

# 'కొత్తలవాడి' చిత్రంతో నిర్మాతగా మారిన రాకింగ్ స్టార్ యష్ అమ్మ శ్రీమతి పుష్ప అరుణ్‌కుమార్... ఆకట్టుకుంటోన్న మూవీ టీజర్

రాకింగ్ స్టార్ యష్ గురించి ప్రత్యేకమైన పరిచయం అక్కర్లేదు. ఆయన అమ్మగారు శ్రీమతి పుష్ప అరుణ్‌కుమార్ ఇప్పుడు నిర్మాతగా మారారు. కొత్త టాలెంట్‌ను




ఎంకరేజ్ చేయటానికి ఆమె PA ప్రొడక్షన్స్ పేరుతో ఆమె చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టారు. కన్నడ చిత్ర పరిశ్రమలో సుప్రసిద్ధ నటుడు డా.రాజ్‌కుమార్, ఆయన సతీమణి పార్వతమ్మ రాజ్‌కుమార్‌ల స్ఫూర్తితో కొత్త బ్యానర్‌ను స్థాపించి కొత్తవారికి అవకాశం ఇవ్వటానికి పుష్ప అరుణ్‌కుమార్ నిర్మాతగా మారారు.

పుష్ప అరుణ్ కుమార్ నిర్మాతగా రూపొందించిన తొలి చిత్రం 'కొత్తలవాడి'. టాలెంటెడ్ యాక్టర్ పృథ్వీ అంబార్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమా ప్రామిసింగ్ ఫిల్మ్ మేకర్ సిరాజ్ రచన, దర్శకత్వంలో రూపొందుతోంది. గత నెలలో ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వచ్చి సినిమాపై అందరిలో ఆసక్తిని రేకెత్తించింది.

'కొత్తలవాడి' సినిమాపై ఉన్న అంచనాలను మరింతగా పెంచుతూ మేకర్స్ బుధవారం (మే 21వ తేదీ ) రోజున టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌ను గమనిస్తే సినిమా పాత్రల్లోని ఇన్‌టెన్సిటీనీ తెలియజేసేలా ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేశారు. మాస్ అండ్ కమర్షియల్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆకట్టుకుంటోంది. సినిమాటోగ్రాఫర్ కార్తీక్ అందించిన సూపర్బ్ విజువల్స్, అభినందన్ కశ్యప్ కంపోజ్ చేసిన పవర్‌ఫుల్ బ్యాగ్రౌండ్ మ్యూజిక్ ఆడియెన్స్‌ను మెప్పిస్తున్నాయి. కథానాయకుడు పృథ్వీ అంబర్ రగ్డ్, ఎనర్జిటిక్ లుక్ ప్రేక్షకులను ఎంతో ప్రభావవంతంగా మెప్పిస్తోంది. 90 సెకన్ల పాటు ఉన్న ఈ టీజర్ సినిమాపై ఉన్న అంచనాలను మరింతగా పెంచింది. రూటెడ్, పవర్‌ఫుల్ కథతో 'కొత్తలవాడి' సినిమాను మన ముందుకు డైరెక్టర్ సిరాజ్ తీసుకురాబోతున్నారనే విషయం అర్థమవుతుంది.

కొత్తలవాడి అనేది కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లాలోని గుండ్లుపేట్ తాలూకులో ఉన్న ఒక గ్రామం పేరు,. అందుకనే ఇక్కడ చిత్రం ఎక్కువ భాగాన్ని చిత్రీకరించారు. సినిమా కథకు సంబంధించిన స్థానికత, దాని మూలాలకు నిజమైన రీతిలో ఉండేలా బృందం స్థానిక యాసను కూడా సంభాషణల్లో ఉపయోగించారు. పృథ్వీ అంబార్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో గోపాల్ దేశ్‌పాండే, రాజేష్ నటరంగ, అవినాష్, కావ్య శైవ, మన్సి సుధీర్, రఘు రమణ కొప్ప, చేతన్ గంధర్వ ఇతర పాత్రల్లో నటించారు. పా ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న కొత్తలవాడి చిత్రం ద్వారా ఇద్దరు కొత్త సంగీత దర్శకులను మేకర్స్ పరిచయం చేస్తున్నారు. వికాష్ వశిష్ట సినిమాలోని పాటలకు సంగీతాన్ని అందిస్తుంటే, అభినందన్ కశ్యప్ బ్యాగ్రౌండ్ స్కోర్‌ను అందిస్తున్నారు. రఘు నీనందల్లి సినిమాకు మాటలు రాశారు. రామిశెట్టి పవన్ ఎడిటర్‌గా, దినేష్ అశోక్ పోస్టర్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు. రా కంటెంట్‌తో తెరకెక్కుతోన్న 'కొత్తలవాడి' చిత్రంలో భావోద్వేగాలు ప్రధానంగా ఉంటాయి. అలాగే ప్రేక్షకులకు కావాల్సిన కమర్షియల్ ఎలిమెంట్స్ సినిమా రూపొందుతోంది.



## మోహన్ లాల్ పుట్టినరోజు సందర్భంగా 'కన్నప్ప' నుంచి స్పెషల్ గ్లింప్స్

మలయాళంలో వరుసగా బ్లాక్ బస్టర్ హిట్లను అందుకుంటున్నారు సూపర్ స్టార్ మోహన్ లాల్. ఆయన నటిస్తున్న చిత్రాలన్నీ కూడా వరుసగా 200 కోట్ల వసూళ్లతో అదరగొడుతున్నాయి. ఆయన త్వరలోనే డైనమిక్ స్టార్ విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్, పాన్-ఇండియన్ క్రేజీ ప్రాజెక్ట్ 'కన్నప్ప'తో ఆడియెన్స్ ముందుకు రానున్నారు. మోహన్ లాల్ పుట్టిన రోజు (మే 21) సందర్భంగా కన్నప్ప నుంచి గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ చిత్రం నుంచి అందరినీ ఆకట్టుకునే అప్డేట్‌ను వదిలారు.

కన్నప్ప మేకర్లు మోహన్ లాల్ బర్త్ డే సందర్భంగా ఒక అద్భుతమైన గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ఈ వీడియోలో మోహన్ లాల్ స్క్రీన్ ప్రెజెన్స్, కనిపించిన తీరు అన్నీ అద్భుతంగా ఉన్నాయి. మోహన్ లాల్ ఈ చిత్రంతో మళ్లీ ఆడియెన్స్‌పై తన ముద్రను వేసేలా కనిపిస్తున్నారు. గూస్ బంప్స్ తెప్పించేలా ఈ గ్లింప్స్‌ను కట్ చేశారు. మోహన్‌లాల్ ఫ్యాన్స్‌ను మెప్పించేలా గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. దైవిక శక్తితో ముడిపడి ఉన్న కిరాత అనే పాత్రను మోహన్‌లాల్ పోషించారు. కిరాత పాత్రలో మోహన్‌లాల్ ప్రెజెన్స్, యాక్టింగ్ అందరినీ ఆకట్టుకుంటుందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం విష్ణు మంచు, కన్నప్ప టీం ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే యూఎస్ టూర్‌ను పూర్తి చేశారు. కన్నప్ప నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్న సంగతి తెలిసిందే. క్యారెక్టర్ పోస్టర్‌లు, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

# ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ ఫుల్‌స్వింగ్‌లో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, పాన్ ఇండియా సూపర్ డైరెక్టర్ అట్లీ కాంబో సినిమా

## ప్రీ ప్రొడక్షన్ వర్క్ కోసం హైదరాబాద్ చేరుకున్న దర్శకుడు అట్లీ

ఐకాన్‌స్టార్, అల్లు అర్జున్, పాన్ ఇండియా సూపర్ డైరెక్టర్ అట్లీ కాంబోలో ఓ సన్సేషనల్ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ కాంబో కోసం భారతదేశ సినీ ప్రేమికులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ అభిమానులు ఎదురుచూశారు. ఈ సన్సేషనల్ కాంబినేషన్ సినిమాను స్టార్ డైరెక్టర్ అట్లీ ఫస్ట్ తెలుగు సినిమా ఇది.ఇండియన్ సినిమా పరిశ్రమనలో నూతన ఉత్తేజాన్ని నింపిన ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ ఎంటర్టైన్‌మెంట్ సంస్థ సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ సమర్పణలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న అంతర్జాతీయ ప్రాజెక్ట్ ఇది. లాస్ ఏంజెల్స్‌లోని ఓ స్టూడియోలో ప్రత్యేకంగా హీరో అల్లు అర్జున్, హాలీవుడ్ టెక్నిషియన్స్, దర్శకుడు అట్లీలపై చిత్రీకరించిన ఓ ప్రత్యేక వీడియో ద్వారా ఈ అనౌన్స్‌మెంట్‌ను చేసి అందరిని సంభ్రమశ్చర్యాలకు గురిచేసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటివరకు టైటిల్ ఖరారు కాని ఈ పాన్-ఇండియా చిత్రంతో, మూడుముఖ్యమైన సృజనాత్మక శక్తులు ఏకమవుతున్నాయి: భారీ బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు అట్లీ (జవాన్, థెరి, బిగిల్, మెర్సల్ వంటి చిత్రాలతో ప్రఖ్యాతి గాంచినవాడు); పుష్ప



చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించి, ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు పురస్కారం పొందిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్; మరియు భారతదేశంలోని అగ్రగణ్య మీడియా సంస్థలలో ఒకటైన సన్ టీవీ నెట్‌వర్క్‌కు చెందిన సన్ పిక్చర్స్. కాగా గత కొన్ని రోజులుగదా ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్ ఫుల్ స్వింగ్‌లో ఉంది. కాగా ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో భాగంగా దర్శకుడు అట్లీ బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆయన హైదరాబాద్‌లో ఐకాన్‌స్టార్‌ను కలిసి ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ సంబంధించిన చర్చల్లో పాల్గొనబోతున్నారు. జూన్‌లో చిత్రీకరణ ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ప్రస్తుతం ప్రాజెక్ట్ A22 x A6గా పిలవబడుతున్న ఈ చిత్రం, భారతీయ విలువలతో కూడిన కథనంతో కూడిన ఓ భారీ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షణ కలిగించేలా రూపొందించనున్న ఈ సినిమా, భావోద్వేగాలు, మాస్ యాక్షన్, పెద్ద స్కేలు నిర్మాణంతో ఓ చారిత్రక సినిమాగా నిలవనుందని చెప్పబడుతోంది. ఈ ప్రత్యేక వీడియో చూసిన అందరూ ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో ఓ మ్యాజిక్ జరగబోతుందని, ఈ చిత్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్, హాలీవుడ్ స్థాయి మేకింగ్ ఉండబోతుందని అర్థమవుతోంది. సంచలన దర్శకుడు అట్లీ తొలిసారిగా తెలుగులో రూపొందిస్తున్న అంతర్ధాతీయ పాన్ ఇండియా సినిమా ఇది. నటీనటులు, సాంకేతిక బృందం మరియు విడుదల తేదీ వంటి వివరాలు త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

# కమల్ హాసన్, శింబు, త్రిష కృష్ణన్, మణిరత్నం 'థగ్ లైఫ్' నుంచి సెకండ్ సింగిల్ షుగర్ బేబీ రిలీజ్

యూనివర్సల్ హీరో కమల్ హాసన్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా "Thug Life" లోని మ్యూజికల్ యూనివర్స్ మరింత స్వీట్ గా మారింది. మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా మూవీ సింగిల్ "షుగర్ బేబీ" రిలీజ్ అయ్యింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాట ఆడియన్స్ మనసుల్ని కొల్లగొట్టింది. స్లిజీ చార్మ్ తో పాటు, అదిరిపోయే వైబ్ తో ఈ పాట, రిథమ్, అటిట్యూడ్ బ్లెండ్ తో ఓ బోల్డ్ కాక్‌టెయిల్‌లా ఆకట్టుకుంటోంది. రెహమాన్ సంగీతం మ్యాజికల్ గా వుంది. సాఫ్ట్, మెలోడిక్ బీట్స్ కట్టిపడేసింది. అలెగ్జాండ్రా జాయ్, శుభ, నకుల్ అభ్యంకర్ వోకల్స్ తో సాంగ్ ని మరింత లైవ్లీగా మార్చారు. ఒక్కో సింగర్ వారి స్వంత వాయిస్ టెక్చర్‌తో పాటకు ప్రత్యేక ఫ్లేవర్‌ను ఇచ్చారు. ఆనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం అదిరిపోయింది. లిరిక్స్ మనసులో నిలిచిపోయేలా వున్నాయి.త్రిషా కృష్ణన్ మెస్మరైజింగ్ బ్యూటీతో కనువిందు చేసింది. ఆమె లుక్స్, గ్రేస్, అన్నీ కలసి తెరపై మ్యాజిక్ ని సృష్టించాయి. రవికే చంద్రన్ అందించిన విజువల్ ఎస్టెటిక్ టచ్‌తో ప్రతి ఫ్రేమ్ విజువల్ ట్రీట్ గా కనిపిస్తోంది. రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 5 న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని శ్రేష్ఠ్ మూవీస్ అధినేత ఎన్. సుధాకర్ రెడ్డి గ్రాండ్ గా విడుదల చేస్తున్నారు.




Editor, Printed, Published and Owned by Sudheer Kumar, Printed at Ratna Graphics , # 2-3-703/7, Thirumala Nagar Colony, Opposite : Police Line , Amberpet, Hyderabad-500013, Published At H.NO. 6-3-553/G2, ClassicCourt Anexa, opp: NKM Grand, Erramanzil Colony, Somajiguda, Hyderabad-500038, T.S. E-Mail: info.southinditimes@gmail.com. ,Contact :9000657700. RNI NO. APTEL/2012/46756